

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం fb.com/vaartha

PUBLISHED FROM RAJAHMUNDRY, VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

18-10-2022 మంగళవారం సంపుటి : 28 సంచిక : 258, పేజీలు : 10+4 వెల : 6.50


ప్రపంచ సుందరీమణుల్లో టాప్-9 దీపికా పదుకొనె 2లో



## కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలో

# 96% పోలింగ్

### ఏఐసిసి కార్యాలయానికి బ్యాలట్ బాక్స్‌లు తరలింపు

### ఢిల్లీలో ఓటువేసిన సోనియా, మన్మోహన్, ప్రియాంక

### కర్ణాటకలో రాహుల్, ఖర్గే, కేరళలో శశిథరూర్

### 19న ఫలితం వెల్లడి




ఓటు వేస్తున్న సోనియా



మల్లికార్జున్ ఖర్గే



శశిథరూర్



రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ జాతీయ అధ్యక్ష ఎన్నికల పోలింగ్ ముగిసింది. సోమవారం ఉదయం 10 గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ప్రశాంతంగా ముగిసింది. ఢిల్లీలోని ఏఐసిసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌తోపాటు వివిధ రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన 63 పోలింగ్ కేంద్రాల్లో 9000మందికి పైగా డెలిగేట్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి జరుగుతున్న ఈ ఎన్నిక ద్వారా ఆ పార్టీలో ఓ కొత్త శకం ప్రారంభమైనట్లే. 25 ఏళ్ల తర్వాత గాంధీయేతర కుటుంబానికి చెందిన వ్యక్తి ఆ పార్టీకి అధ్యక్షుడు కానున్నారు. మల్లికార్జునఖర్గే, శశిథరూర్‌లు అధ్యక్ష స్థానానికి పోటీ పడిన విషయం తెలిసిందే. ఈ ఎన్నిక విషయంలో ఇరువురి నుంచీ చెప్పుకోదగిన ఫిర్యాదులుగానీ, ఆరోపణలుగానీ లేకుండానే పోలింగ్ జరిగింది. బ్యాలెట్ బాక్సుల్లో ఫలితం నిక్షిప్తమై ఉంది. ఈ నెల 19న కౌంటింగ్ జరగనున్నది. అదే రోజు ఫలితం వెలువడుతుంది.

అధ్యక్ష స్థానానికి పోటీపడిన కర్ణాటక సీనియర్ నేత ఖర్గే బెంగళూర్‌లోనూ, శశిథరూర్ కేరళలోనూ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ, మన్మోహన్‌సింగ్, చిదంబరం, జైరామ్ రమేశ్‌వంటి పలువురు సీనియర్ నేతలు ఢిల్లీలోని ఏఐసిసి కార్యాలయంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. భారత్ జోడో యాత్రలో ఉన్న రాహుల్ గాంధీ కర్ణాటక బళ్లారిలోని క్యాంప్‌లో తన ఓటు వేశారు. ఆయా రాష్ట్రాల్లో పిసిసి అధ్యక్షులు, మిగతా డెలిగేట్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ అత్యంత ప్రశాంతంగా, పారదర్శకంగాజరిగిందని, ఎలాంటి ఫిర్యాదులు ≫2

## తిరుమలలో రోజుకు 20 వేల టోకెన్లు! త్వరలోనే సామాన్య భక్తులకు టైమ్‌స్లాట్ 3లో



'సుప్రీం' సిజెగా నియమితులైన చంద్రచూడ్

## 'సుప్రీం' చీఫ్ జస్టిస్‌గా

# చంద్రచూడ్ నియామకం

### ఆమోదముద్ర వేసిన రాష్ట్రపతి ముర్ము

### నవంబర్ 9న బాధ్యతల స్వీకరణ

**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** డాక్టర్ జస్టిస్ డివై చంద్రచూడ్ భారత 50వ ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఆయన నియామకానికి ఆమోదముద్ర వేసారు. కేంద్ర న్యాయశాఖమంత్రి కిరెన్ రిజిజు జస్టిస్ చంద్రచూడ్ నియామకాన్ని వెల్లడించారు. వచ్చేనెల 9వ తేదీ ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు.ప్రస్తుత జస్టిస్ యుయు లలిత్ అంతకుముందు రిటైర్ అవుతున్నారు. కొత్త న్యాయమూర్తికి రెండేళ్ల పదవీకాలం ఉంది. 2024 నవంబరు 11వ తేదీ వరకూ ఆయన సర్వీసు కాలం ఉన్నట్లు కేంద్ర న్యాయశాఖ తెలిపింది. జస్టిస్ లలిత్‌ఒక్కరే అత్యంత స్వల్ప పదవీకాలంలో చీఫ్‌జస్టిస్‌గా ≫2

# మాట తప్పం-మడమ తిప్పం

### ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం, రైతులకు భారీగా పెట్టుబడి సాయం: సిఎం జగన్



సోమవారం నంద్యాలజిల్లా ఆళ్లగడ్డ పట్టణంలో వైఎస్ఆర్ రైతుభరోసా నగదును జమ చేస్తున్న సిఎం జగన్

**నంద్యాల, అక్టోబరు 17ప్రభాతవార్త:** రాష్ట్రంలో కరువుకాటకాలు లేకుండా దేవుడి దయతో మీఅందరి చల్లని అశీస్సులతో ఈప్రభుత్వాన్ని మూడు సంవత్సరాల నాలుగు నెలల్లో కోట్లాది రూపాయల సంక్షేమ పథకాలకు ఖర్చుచేసిన ఏకైక ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని రైతు సంక్షేమం కోసమే ఈ ప్రభుత్వం పనిచేస్తుందని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణ బహిరంగసభలో ఆయన మాట్లాడారు. ఆళ్లగడ్డకు విచ్చేసిన ముఖ్యమంత్రి ప్రత్యేక కాన్వాయ్‌కి ఇరువైపుల రహదారి వెంట పెద్ద సంఖ్యలో వేచివున్న ప్రజలు అభివాదం చేశారు. ముఖ్యమంత్రి ఆళ్లగడ్డకు రావడంతో నియోజకవర్గంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి ముఖ్యమంత్రిని చూసేందుకు ఉత్సాహం చూపారు. దారిపొడుగునా ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి నవ్వుతూ నమస్కరిస్తు కాన్వాయ్‌లో ముందుకు సాగడంతో ప్రజలు కూడ ప్రతినమస్కారం చేస్తు ఆనందం వ్యక్తం చేశారు. సభా ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం అందించడం చాల సంతోషంగా ఉందని పేర్కొన్నారు. జిల్లాలో సహజ ఖనిజ వనరులు, తాగు, సాగునీటి వనరులు, ప్రాజెక్టులు రిజర్వాయర్లకు పుట్టినిల్లు నంద్యాల జిల్లా అని కొనియాడారు. రైతు భరోసా కింద ఏటా రూ.13,500లు అర్హులైన రైతులకు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదే అన్నారు. ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ అన్నదాతకు అన్నివిధాలుగా అండగా ఉంటూ ప్రతివిషయంలో వారిని చేయిని పట్టుకొని నడిపిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఏ రైతు అప్పులపాలు కాకూడదని గొప్ప అలోచనతో వైయస్ఆర్ రైతుభరోసా పథకాన్ని ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారన్నారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన సరుకును వారికి 45 రోజుల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమచేస్తున్నామంటే అది వైయస్ జగన్‌తోనే సాధ్యమన్నారు. ఈసందర్భంగా ఆయన పట్టణంలోని పలు సమస్యలను, ఖర్చుల వివరాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. రైతులు దస్తగిరి, నాయక్‌లు రైతు భరోసా గురించి ఉద్రేకభరితంగా మాట్లాడి వచ్చిన అతిథులను ముఖ్యమంత్రి మనసును చూరగొనే విధంగా మాట్లాడడం విశేషం. వారు ఇరువురు ప్రభుత్వంచే అందుకున్న సొమ్ము వివరాలను ఆరోగ్యశ్రీని, ఒంటరి మహిళ పెన్షన్‌ను, పంట ఈకెవైసి వివరాలను తెలిపి సభికులను కూడా అకట్టుకున్నారు.

**రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుటుంది : వ్యవసాయశాఖ మంత్రి:** రాష్ట్ర ప్రభుత్వం రైతన్నకు అండగా నిలబడేదానికి రైతుభరోసా కార్యక్రమాన్ని మేనిఫెస్టోలో ప్రకటించిన దాని కంటే కూడా రూ.1000లు అదనంగా కలిపి సంవత్సరానికి రూ.13500లు రైతు భరోసా, పిఎం కిసాన్ పథకాన్ని అమలుచేస్తు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్రవ్యవసా య శాఖమంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమ ≫2

## 'సుప్రీం'లో చుక్కెదురు..

### ఎన్జీటి తీర్పుతో రాష్ట్రం రూ.250 కోట్ల పరిహారం చెల్లించాల్సిందే

**విజయవాడ,అక్టోబరు17ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది.పోలవరం,పురుషోత్తమపట్టణం,పట్టిసీమప్రాజెక్టుల నిర్మాణంపై ఎన్జీటీ సంయుక్త కమిటీ విధించిన నష్టపరిహారాన్ని వెంటనే జమ చేయాలని సోమవారం సుప్రీం కోర్టు ఆదేశించింది. గతంలో ఎన్జీటీ ఇచ్చిన తీర్పులో అన్ని అంశాలను యథాతథంగా అమలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది.దాదాపు రూ.250 కోట్ల పరిహారంపై తదుపరి విచారణ కొనసాగిస్తామని తెలిపింది.అప్పటి వరకు ఎన్టీటీ తీర్పులోని అన్ని అంశాలను అమలు చేయాలని సూచించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో పర్యావరణ అనుమతుల ఉల్లంఘనపై ఏపీ ప్రభుత్వానికి జరిమానావిధిస్తూ ఇటీవలఎన్టీటీ తీర్పు ఇచ్చింది. పురుషోత్తం పట్నంకు రూ.2.48 కోట్లు, పట్టిసీమకు రూ.1.90కోట్లు పరిహారం చెల్లించాలని ఆదేశించింది,ఎన్టీటీ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ అప్పీల్‌పై సుప్రీం కోర్టు విచారణ జరిపింది.ఎన్జీటీ తీర్పు సహేతుకంగా లేదని,తాము ఎటువంటి నిబంధనలను అతిక్రమించలేదని ఏపీ ప్రభుత్వం తరుపున న్యాయవాది కోర్టులో ≫2

## కృష్ణా బోర్డు చర్చలకు హాజరుకాని ఎపి, టిఎస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, అక్టోబర్17:** ఎలాంటి చర్చ లేకుండానే కృష్ణా నదీ యాజమాన్య బోర్డు జలాశయాల పర్యవేక్షక కమిటీ సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. కెఆర్‌ఎంబీ సభ్యుడు రవి కుమార్ పిళ్లై ఆధ్వర్యంలో జలసౌధలో కమిటీ ఐదో సమావేశం జరిగింది.తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ అధికారులు ఈ సమావేశానికి హాజరు కాలేదు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో జల విద్యుత్ ఉత్పత్తి కోసం మార్గదర్శకాలు, వరద జలాల లెక్కలు,రూల్ కర్వ్‌కు సంబంధించిన నివేదికను ఖరారు చేసి సంతకాలు చేసేందుకు గతంలోనే ఆర్ఎంసీ సమా వేశాన్ని ఏర్పాటు చేసినప్పటికీ వివిధ కారణాల రీత్యా సమావేశం వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా ఆర్ఎంసీఐదో సమావేశాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ≫2

# రైతులేనిదే అభివృద్ధి అసాధ్యం



ఏలూరులో సోమవారం కిసాన్ సమృద్ధి కేంద్రం ప్రారంభ సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

### రైతు సంక్షేమంపై ప్రత్యేక దృష్టిసారించిన పిఎం

### ఎరువుల సరఫరాలో బస్తాకు రూ.2,500 సబ్సిడీ ఇస్తున్న కేంద్రం

### ఏలూరులో పిఎం కిసాన్ సమృద్ధి కేంద్రం ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త-ఏలూరు:** రైతులు లేనిదే దేశాభివృద్ధి సాధ్యంకాదని, రైతు సంక్షేమంపై దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిశాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రైతులు పంట దిగబడిలో ఆర్థికంగా స్థిరత్వం సాధించాలంటే భూసార పరీక్షలు ఆధారంగా పంట వేయాలని సూచించారు. రైతుల మేలు కోరి బిజెపి ప్రభుత్వం ఒకఎరువుల బస్తాకు రూ.2,500లు వరకు సబ్సిడీ అందజేస్తుందన్న విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తించాలన్నారు. పిఎం కిసాన్ ద్వారా ఏడాదికి రూ.6 వేలు నేరుగా రైతుల బ్యాంకు అక్కౌంట్లలోకి జమ చేయడం జరుగుతుందన్నారు. రైతులు లేని రాజ్యం లేదని, గ్రామ రాజ్యం లేకుండా రామరాజ్యం సాధ్యపడదనే విధానంతోనే పిఎం మోడీ రైతులకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా వున్న 2.70 లక్షల ఎరువుల దుకాణాల్లో కూడా రానున్న రోజుల్లో పిఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా రైతులకు పూర్తి స్థాయిలో అందుబాటులో వుంచేందుకు కేంద్రం అన్ని చర్యలు తీసుకుందన్నారు. సోమవారం ఏలూరు జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో పిఎం కిసాన్ 12వ విడత నిధులు వర్చువల్ ప్రారంభోత్సవం, ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి 600 కేంద్రాల ప్రారంభోత్సవం, వన్‌నేషన్ వన్ ఫెర్టిలైజర్‌ను ప్రారంభించే కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ సాంకేతికతతో అభివృద్ధి సాధ్యపడినా ఆకలి తీరదని, మనిషి ఆకలి తీర్చడానికి రైతు తన చెమటను కష్టంగా మార్చి పంట పడిస్తేనే ఆకలి తీరుతుందనే విషయాన్ని గమనించాలన్నారు. ఎంత కష్టం వచ్చినా మట్టిని నమ్ముకునే రైతు మనందరి కోసం దుక్కి దున్ని పంట పండిస్తారన్నారు. కరోనా సమయంలో ప్రజలందరూ ఇంట్లో కూర్చుని వుంటే ప్రజల కడుపు నింపడానికి రైతులు మాత్రం పంట పండించారన్నారు. రైతుల అభివృద్ధి కోసం మోడీ సర్కార్ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత 508 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని రైతుల ≫2

# పెట్టుబడిదారీ శక్తులపై పోరాటం

### సిపిఐ జాతీయసభలో పలువురు వక్తలు: రాష్ట్రంలో పోలీసు పాలన సాగుతోంది: నారాయణ



సీపీఐ జాతీయసభలో ప్రసంగిస్తున్న విదేశీ పార్టీ ప్రతినిధి

**విజయవాడ,అక్టోబరు17,ప్రభాతవార్తప్రతినిధి:** దేశీయంగాను, అంతర్జాతీయంగాను సామ్రాజ్యవాదం,మతత్వం,పెట్టుబడిదారి శక్తులపై సంఘటిత పోరాటం సాగాల్సి ఉందని భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సభలు పిలుపునిచ్చాయి,సిపిఐ 24వ జాతీయ మహాసభలు విజయవాడలో జరుగుతున్నాయి.గురుదాస్ గుప్త(ఎస్ఎస్ కన్వెషన్‌సెంటరు)లో ప్రతినిధుల సభలు అంతర్భాగంగా జరుగుతున్నాయి.నాలుగవ రోజుకు చేరుకున్న ఈ సభల్లో 16 దేశాలకు చెందిన 17 మంది విదేశీ ప్రతినిధులు అంతర్జాతీయంగా నెలకుని ఉన్న పరిస్థితులు,అమెరికన్ సామ్రాజ్యవాద విధానాలతో అభివృద్ధి చెందుతున్న దేశాలకు కలుగుతున్న నష్టం తది తరంశాలపై ఉద్వేగ భరిత ప్రసంగాలు చేస్తున్నారు.భారత్ దేశంతో చైనా మెరుగ్గా సంబంధాలను కొనసాగిస్తుందని చైనా నుంచి వచ్చిన కమ్యూనిస్టుపార్టీ ప్రతినిధులు తెలిపారు.త్వరలో తమ దేశం అంతర్జాతీయంగా అత్యాధునిక సోషలిస్టుగా ఆవిర్భవించేందుకు ప్రణాళికలు ≫2



సోమవారం గన్నవరం విమానాశ్రయంలో పవన్, నాదెండ్ల

# ఇదేనా ప్రజాస్వామ్యం?

### కాపాడాల్సినవారే కాలరాస్తారా!

### విజయవాడలో మీడియాతో పవన్

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఇతరనేతలతో సమాలోచనలు

**విజయవాడ,అక్టోబరు17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పోలీసులపై తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ స్పష్టం చేసారు.వైకాంగ్రెస్‌పై తాము విధానసరమైన పోరాటం మాత్రమే చేస్తున్నామన్నారు.అయితే రాష్ట్రంలో ప్రభుత్వం ఆలోచన విధానం సరిగ్గాలేదన్నారు.ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారు.అధికార పార్టీ వాళ్ళు,రెచ్చగొట్టి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే భావ స్వేఛ్ఛ,తమ కార్యకర్తలు నినాదాలు చేస్తే అరెస్టులు,హత్యాయత్ననేరాలా అని ప్రశ్నించారు. జనసేన రాష్ట్రకార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ పరిణామాలపై న్యాయపోరాటం చేస్తాం,కార్యకర్తలను విడిపించుకుంటామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు. విశాఖలో తమ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారన్నారు.ఏకంగా పలువురిపై హత్యాయత్న కేసులు పెట్టి బయపెట్టే ప్రయత్నం చేసారు.తమ పార్టీ కార్య కర్తలు 115మంది కేసులు పెట్టారన్నారు.వారిలో అందరిని విడిపించామన్నారు. కొందరు ≫2

# ఎంపి నామాకు ఇడి షాక్

### ఆయన కుటుంబానికి చెందిన రూ.80.66 కోట్లు జప్తు

### ఆరు డొల్ల కంపెనీలకు నిధుల మళ్లింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబర్17:** టిఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) షాక్ ఇచ్చింది. ఆయన కుటుంబానికి చెందిన 80.66 కోట్లను జప్తు చేసింది. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని మధుకాన్ గ్రూప్ ప్రధాన కార్యాలయంతో పాటు హైదరాబాద్, ఖమ్మం, ప్రకాశంజిల్లాలోని 28 స్థిరాస్తులను అటాచ్ చేసింది.రాంచీ ఎక్స్‌ప్రెస్ హౌవే పేరిట నామా నాగేశ్వరరావు రుణాలు తీసుకొని దారి మళ్లించారని ఈడీ ఆరోపించింది. సుమారు రూ.361.92 కోట్లు నేరుగా మళ్లించినట్లు గుర్తించామని పేర్కొంది. నామా నాగేశ్వరరావు, నామా సీతయ్య ఆధీనంలో ఆరు డొల్ల కంపెనీలు ఉన్నట్లు ఈడీ వెల్లడించింది. రుణాల పేరిట మోసం చేసిన కేసులో గతంలో నామాకు చెందిన రూ.73.43 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన విషయం తెలిసిందే.

# రోజుకు 20వేల టోకెన్లు!

## త్వరలోనే సామాన్యభక్తులకు టైమ్‌స్లాట్

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** అటు వెంకన్న సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముగియడం...ఇటు పెరటాసి మాసం శనివారాలు దాదాపు పూర్తికావడంతో భక్తుల రద్దీ మోస్తరుగా కొనసాగుతోంది. దేశంలోని పలు ప్రాంతాలనుంచి తిరుమలకు వచ్చే భక్తులు రోజువారీగా సుమారుగా 90వేలమంది వరకు ఉంటుంది. ఇంతమంది కొండపైకి చేరుకుంటే సర్వదర్శనం సమయం కూడా 12గంటలు పైగానే పడుతుంది. ఈ నేపథ్యంలో సాధారణ సర్వదర్శనం విధానాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం కొనసాగిస్తూ ఏకంగా బయటి ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సాఫీగా, సంతృప్తిగా తక్కువ సమయంలో ఇష్టదైవమ్ దర్శనం చేయించేలా టిటిడి పెద్దలు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం తిరుపతిలో రోజుకు 20వేలవరకు సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేసేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. టోకెన్లు పొందిన భక్తులు ఆయా తేదీల్లో ఆ సమయానికి కొండకు చేరుకుంటే వసతి ఇబ్బందులు తగ్గుతాయి. పైగా సామాన్యభక్తులు కొంత సులభంగా స్వామివారిని దర్శనం చేసుకునే వెసలుబాటు కలుగుతుంది.

రానున్న పదిరోజుల్లోనే తిరుపతిలో టైమ్‌స్లాట్ సర్వదర్శన టోకెన్లు జారీచేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



**సత్వరదర్శనం కోసమే టైమ్‌స్లాట్:** వెంకన్న దర్శనం కోసం వస్తున్న అశేషసంఖ్యలో సామాన్యభక్తులకు మరింత సంతృప్తికరంగా, సత్వరం దర్శనం చేయించేందుకు వీలుగా టైమ్‌స్లాట్ సర్వదర్శనం టోకెన్లు జారీ చేయాలని పాలకమండలి ఇప్పటికే నిర్ణయించింది. ఈ టోకెన్లు తిరుపతిలోని శ్రీనివాసం, భూదేవికాంప్లెక్స్ తోబాటు టిటిడి సత్రాల్లో కౌంటర్లలో జారీచేయాలని నిర్ణయించారు. భక్తులు సాఫీగా కౌంటర్లవద్దకు చేరుకునేందుకు వీలుగా క్యూలైన్లు, భక్తుల మధ్య తోపులాట జరగకుండా నియంత్రించేలా ఏర్పాటుచేశారు. సరాసరిగా రోజువారీగా దేశంలోని అనేక ప్రాంతాలనుంచి భక్తులు 70వేలవరకు తిరుపతికి చేరుకుంటున్నారు. ఇక్కడ భక్తులు తమ దర్శనానికి సంబంధించి ఉచిత టైమ్‌స్లాట్ సర్వదర్శన టోకెన్లను పొందిన తరువాత అదేరోజుగానీ, మరుసటిరోజు దర్శనం కేటాయించేలా చూడనున్నారు. భక్తులు రద్దీ పెరిగే వారాంతంరోజుల్లో 24గంటలు సమయం పట్టినా ముందు వచ్చిన భక్తులకు ముందుగానే అనే విధంగా టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేయనున్నారు.

రోజువారీగా సుమారుగా 20వేల వరకు ఈ టోకెన్లుజారీచేయాలని టిటిడి వర్గాల ఆలోచన. భక్తులు తమకు సంబంధించి ఆధార్‌కార్డుతో తిరుపతికి వస్తే టైమ్‌స్లాట్ దర్శన టోకెన్లు జారీచేస్తారు. ఆరునెలల క్రిందట వరకు తిరుపతిలో భక్తులకోసం ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టోకెన్లు జారీచేసేవారు. గత ఏప్రిల్ నెలలో తలెత్తిన పరిణామాలతో తాత్కాలికంగా రద్దుచేశారు. ఇటీవల జరిగిన "డయల్ యువర్ ఇఓ"కార్యక్రమంలోనూ పలువురు భక్తులు అడిగిన ప్రశ్నలకు ఇఓ ఏవి ధర్మారెడ్డి సమాధానంగా త్వరలోనే తిరుపతిలో (సర్వదర్శనం టైమ్‌స్లాట్)ఎస్ఎస్‌డి టోకెన్లు జారీచేస్తామని వెల్లడించారు. ఉదయం 6గంటల నుంచి ఆయారోజుకు సంబంధించి టోకెన్లు జారీకానున్నాయి. రోజుకు 20వేల టోకెన్లు జారీఅయితే ఆ తరూవాత మరుసటిరోజు దర్శనానికి సంబంధించిన టోకెన్లు ఇస్తారు. టైమ్‌స్లాటెడ్ టోకెన్లు పొందిన భక్తులు వీలైనంతవరకు తిరుపతిలోనే వసతి పొందాలని టిటిడి అధికారుల విజ్ఞప్తి. తిరుమలలో ఉన్న అతిథిగృహాలు, కాటేజీల గదులు 30వేలమంది వరకు మాత్రమే బసకల్పించే వీలుంది. ఆ పై భక్తులు కొండకు వస్తే వసతి కష్టంగామారింది. ఈ నేపథ్యంలో తిరుపతిలోని టిటిడి శ్రీనివాసం వసతి సముదాయం, మాధవం, విష్ణునివాసం, టిటిడి సత్రాలు తదితర చోట్ల భక్తులు గదులు తీసుకుని బసచేయాలని కోరుతున్నారు.



## శ్రీవారి సేవలో ప్రముఖులు

**తిరుమల,అక్టోబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం ఉదయం ప్రముఖులు దర్శించుకున్నారు. విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో మాజీ ఎంపి వి.భాకర్‌శాస్త్రి, పుదుచ్చేరి స్పీకర్ సెల్వంకుటుంబంతో కలసి వెంకన్న సేవలో పాల్గొని ఆశీస్సులందుకున్నారు. వీరికి టిటిడి అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.



## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

**తిరుమల,అక్టోబర్ 17 ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన పెరటాసిమాసం చివరకు చేరుకోవడంతో తిరుమలలో భక్తులరద్దీ మోస్తరుగా కొనసాగుతోంది. తమిళ భక్తులకు పవిత్రమైన మాసం కావడంతో కాలినడకన తమిళభక్తులు ఎక్కువసంఖ్యలో తిరుమలకు వస్తున్నారు. సోమవారం సాయంత్రానికి వైకుంఠం-2లో 28కంపార్టుమెంట్లలో నిండిపోయి సర్వదర్శనానికి 12గంటలు కేటాయిస్తున్నారు. సాయంత్రం వరకు 51వేలమంది భక్తులు మహాలఘులో దర్శనం చేసుకున్నారు. దర్శనానంతరం భక్తులు తిరుగుప్రయాణానికి బస్సుల్లో రద్దీ కనిపించింది.

## దాడులు చేస్తే అరెస్టు చేయకుండా సన్మానాలు చేయాలా?

### రాష్ట్ర జలవనరులమంత్రి అంబటి రాంబాబు



**సచివాలయం, అక్టోబర్17, ప్రభాతవార్త:** చంద్రబాబుకు పవన్ 3 రోజులు కాల్‌షీట్ ఇచ్చారని, అందులో భాగంగానే విశాఖలో అలజడి సృష్టించారని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు దుయ్యబట్టారు. ఏపీలో అతిపెద్ద నగరం విశాఖపట్నం దేశంలోని నరగరాలతో పోటీపడగల నగరం అన్నారు. చంద్రబాబు నుంచి ప్యాకేజ్ తీసుకొని కుట్రలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర మంత్రులపై దాడులు చేయించారు. విశాఖ గర్జనకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. దాడులు చేస్తే అరెస్టు చేయకుండా సన్మానాలు చేయాలా.. హింసను ప్రోత్సహిస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోవాలా అంటూ మంత్రి ప్రశ్నించారు. అమరావతి పాదయాత్ర పేరుతో రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. అమరావతిలో తప్ప మరో చోట అభివృద్ధి జరగడం చంద్ర బాబు, రామోజీరావులకు ఇష్టం లేదన్నారు. టీడీపీ రౌండ్ టేబుల్ సమావేశంలో నోటికొచ్చినట్టు మాట్లాడారు. మా గర్జనకు 10 వేల మంది వచ్చారన్నారు.. మీకు అసలు కళ్లుఉన్నాయా అని ప్రశ్నించారు. చంద్రబాబు వాణి వినిపించేందుకు పవన్ విశాఖ వచ్చారని ధ్వజమెత్తారు. మేం గర్జన తేదీ ప్రకటించిన తర్వాతే పవన్ తన పర్యటనను ఖరారు చేశారన్నారు. గర్జనకు వచ్చిన ప్రజాదారణను డైవర్ట్ చేయడానికే పవన్ ప్రయత్నం చేశాడన్నారు. జనసేన పేరు మార్చుకుని, బాబు సేన..అహింసా సేనగా పెట్టుకోవాలన్నారు. హింసను ప్రేరేపించిన ఏ రాజకీయపార్టీ బతికిబట్టగట్టిన చరిత్ర లేదన్నారు. విశాఖకు పాలనా రాజధాని వచ్చి తీరుతుందని, ఇది తథ్యం అని అంబటి రాంబాబు అన్నారు.



కెమికల్స్ నీరు కలిసిన చేపల చెరువు

## కెమికల్స్ కలిసిన నీటితో రూ.3లక్షల విలువైన చేపలు మృత్యువాత

**ఎ కొండూరు, అక్టోబరు 17, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం గొల్లమందల వావిలాల చెర్వులో సుమారు రూ.3లక్షల విలువగల చేపలు విషపూరిత కెమికల్స్‌ను కొందరు గుర్తు తెలియని ప్రయివేట్ కెమికల్స్ ఫ్యాక్టరీ యజమానులు రేపూడి విప్పలవాగు, దాని పక్కనే మరో పంట కాల్వలో ట్యాంకర్ ద్వారా వదలటంతో ఆ నీరు చెఱువులోకి వెళ్లడంతో ఆ నీరు చెరువులోకి వెళ్లడంతో చేపలు మృతి చెందాయి. ఈ వావిలాల (గొల్లమందల చెర్వు)లో మలమంటి నాని, వంకలపాటి సాంబశివరావు, షేక్ తురాబ్, సింగిశాల వెంకయ్య అనే లీజుదారులు చెరువులో చేపలు పెంచే నిమిత్తం రూ.8లక్షల విలువ గల చేప పిల్లలను పెంచి పోషిస్తున్నారు. రేపూడి గ్రామం వద్ద గల విప్పలవాగు, పక్కనే మరో పంట కాల్వలో ఈ కెమికల్స్‌ను ట్యాంకర్ ద్వారా విడుదలచేయడంతో ఆ కెమికల్స్ నీరు చెరువుతో పాటు వరిపంట పొలాలకు సరఫరా కావడంతో కొన్ని వరిపొల్లాల్లో వరిపంట పూర్తిగా మాడిపోవడంతో ఆరుకాలం కష్టించి వరిపంట పండిస్తున్న సన్న,చిన్నకారు రైతులు ఆర్థికంగా నష్టపోయి గగ్గోలు పెడుతున్నారు. ఇకనైనా రేపూడి ప్రాంతంలోని విప్పలవాగు, మరో పంటకాల్వ వద్ద ట్యాంకర్ ద్వారా కెమికల్స్ విడుదల చేసి చేపలుపెంచే లీజుదారులను, వరిపంట దెబ్బతిని నష్టపోయిన సన్న, చిన్నకారు రైతులను ఆదుకోవాలని, అలాగే కెమికల్స్‌ను ట్యాంకర్ ద్వారా వేరే ప్రాంతాల నుండి తీసుకువచ్చి రేపూడి విప్పలవాగు వద్ద, పంట కాల్వ వద్ద విడుదల చేసిన గుర్తు తెలియని కెమికల్స్ ఫ్యాక్టరీ యజమానులను గుర్తించి తమకు న్యాయం చేయాలని బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఎ కొండూరు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసినట్లు మలమంటినాని అనే చేపల చెర్వు పెంపకం లీజుదారుడు స్థానిక విలేకరులకు తెలిపారు.

## జూటూరులో వైఎస్సార్సీ సానుభూతిపరులపై టిడిపి నాయకుల దాడి

### ఒకే కుటుంబానికి చెందిన 5గురికి తీవ్రగాయాలు

### దాడిలో 11మంది టిడిపి నాయకులు

### గ్రామంలో పోలీసులు అలర్ట్

### భయాందోళనలో గ్రామస్తులు

**పెద్దపప్పూరు, అక్టోబర్ 17 ప్రభాతవార్త:** మండలంలోని జె.సి సోదరుల స్వగ్రామం జూటూరులో ఫ్యాక్షన్ పడగ విప్పింది. సోమవారం పొలాలకు వెళ్లే దారి విషయమై గ్రామానికి చెందిన వైసిపి సానుభూతిపరులను ఇదే గ్రామానికి చెందిన నారాయణరెడ్డితో పాటు 11 మంది టిడిపి నాయకులు కొడవళ్లు, కర్రలతో ఇంటిపైకి వెళ్లి దాడికి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో వైసిపి సానుభూతిపరులైన ఒకే కుటుంబానికి చెందిన రామ్మోహన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రామిరెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డిలు తీవ్రంగా గాయపడ్డారు. తలకు, చేతులకు, కాళ్లకు రక్తగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామంలో రంగప్రవేశం చేసి గాయపడిన వారిని అంబులెన్స్‌లో తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా వున్నట్లు తెలిసింది. ప్రశాంతంగా వున్న గ్రామంలో ఒక్కసారిగా ఫ్యాక్షన్ పడగవిప్పడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పెద్దఎత్తున పోలీసులు గ్రామాన్ని చుట్టుముట్టి ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు. డిఎస్‌పి చైతన్య, సిఐ రామకృష్ణ, ఎస్‌ఐ ఖాజాహుసేన్ గ్రామంలోని బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.

## రాజధానిపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ఉండాలి

### వచ్చే ఎన్నికల్లో ఆంధ్రా నుంచి పోటీ: లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ



**విజయవాడ,అక్టోబరు17.ప్రభాతవార్తప్రతినిధి:** రాజధానిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక స్పష్టతతో ఉండాలని, తికమకలు చేస్తే ఇబ్బందులు పాలవుతుందని లోక్ సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ కీలక వ్యాఖలు చేసారు. రాష్ట్రానికి ఏకైక రాజధానిగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయాలన్నారు ముందు చూపులేకుండా ఏపీ ప్రభుత్వం సంక్షేమం పేరటి ఎడాపెడా అప్పులు చేస్తే, చివరికి శ్రీలంక మాదిరిగా మారుతుందన్నారు. సంక్షేమం ఒక్కటే అమలు చేస్తే సరిపోదని, ఆ వంకతో అభివృద్ధిని విస్మరించడం సరికాదన్నారు. ఏపీకి ప్రత్యేకహోదా అంశం పెండింగ్‌లో ఉందని, విభజన హామీలు నేరవేరలేదన్నారు. అందు వలన ఏపీ నుంచి వచ్చే ఎన్నికల్లో లోక్‌సత్తా పోటీ చేస్తోందన్నారు. విజయవాడలో జరిగిన లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశం ఈ పర్యాయం ఏపీకి ప్రయోజనం కలిగించేందుకు జెపీ పోటీ చేయాలని ఈ కార్యవర్గం సమావేశం ఏకగ్రీవంగా తీర్మా నించింది. లోక్‌సత్తా కలిసి వచ్చే వారితో నూతన రాజకీయ వేదిక నిర్మాణం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. త్వరలో పార్టీ నేతలు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించాలని తీర్మానించారు. రాష్ట్రంలో మౌలిక మార్పులకు ప్రజలు సిద్ధం కావాలని ఈ సందర్భంగా జయప్రకాశ్‌నారాయణ పిలుపునిచ్చారు. ఏపీలో పాలన గాడితప్పిందని, ఈ పరిస్థితి మారాలన్నారు. రాష్ట్ర ఆర్దిక పరిస్థితి. రుణాలు పెరగడంపై జేపీ ఆందోళన వ్యక్తం చేసారు. అప్పు చేసి పప్పుకూడా సరైన పద్ధతి కాదన్నారు. రేపటి భవిష్యత్తు కోసం పునాదులు వేయాలన్నారు. రాష్ట్ర ఆర్దిక స్దితిని పణంగా పెట్టి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేయవద్దని ప్రభుత్వాన్ని కోరారు. ముందు చూపులేకుండా ప్రభుత్వం రాజకీయ పార్టీలు వ్యవహరించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగాయని ఏపీ ప్రభుత్వం చెబుతుంది నిజం కాదన్నారు. ఆ పాఠశాలల్లో ఇంగ్లీషు అర్దం కావడం లేదన్నారు. అయితే ఇంగ్లీషు మాధ్యమానికి వ్యతిరేకం కాదన్నారు.

## లోబావిని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతాం

### దేవస్థానం చైర్మెన్ శ్రీనివాసులు

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 17 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహించబడుతున్న కైలాసగిరుల్లోని తీర్థాలను అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామని ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ప్రత్యేక నిపుణుల కమిటితో పలు ప్రాంతాలను పరిశీలించి ప్రణాళికలు రూపొందించుటకు సమాలోచనలు జరిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి నాడు పరిపాలించిన రాజులు కైలాసగిరుల్లో 24వేల ఎకరాల భూములు కేటాయించారు. అయితే కాల క్రమేణ ఈ భూములు అక్రమణలకు గురై ప్రస్తుతం సుమారు 5వేల ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉందని వాస్తవంగా ఎంత భూమి మిగిలి ఉందో సర్వే జరిపి రాతమూలకంగా తమకు భూములు అప్పగించాలని చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆర్‌డిఓను కోరినట్లు వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ స్థల పురాణంలో 324 తీర్థలున్నట్లు చెబుతుందని అయితే అవి అన్ని కాలగర్భంలో కలసి పోయాయని అయితే అందుబాటులో ఉన్న వాటికి పూర్వ,మహాదశ కల్పించుటకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు.

**భరద్వాజ తీర్థం పర్యాటక కేంద్రం:** శ్రీకాహస్తీశ్వరాలయానికి సమీపంలో కొండల మధ్య భరద్వాజ తీర్థం ఉందన్నారు. ఈ ప్రాంతాలను పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని చైర్మెన్ వివరించారు. ఇక్కడ కోట్ల రూపాయలతో దేవస్థానం 125గదుల సత్రాలను నిర్మిస్తే, మరో డార్మెంటరీని టిటిడి నిర్మించిందన్నారు. ఇక్కడ సదుపాయాల కల్పనకు దేవస్థానం చర్యలు తీసుకుంటుందన్నారు. అలాగే ఇక్కడి భరద్వాజాశ్వరాలయంతోపాటు ప్రకృతి అందాలను ఆహ్లాదంగా వచ్చే భక్తుకు స్థానికులకు ఆహ్లాదంగా తీర్చి దిద్దుటకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇక్కడి ఆలయాన్ని చోళరాజులు నిర్మించినట్లు దాఖలాలు ఉన్నాయని వివరించారు. కైలాసగిరుల్లో వెలసిన తీర్థాలను అభివృద్ధికి పక్కా ప్రణాళికలు రూపొందించుటకు చర్యలు తీసుకుంటున్నామని ఇందులో భాగంగానే సోమవారం పరిశీలనలు జరిపామని తెలిపారు. హరహర తీర్థంలో వెలసిన మూలవిరాట్టుకు సోమవారం షోడషాభిషేకాలు సమర్పించి నైవేద్య ప్రసాదాలు అందించినట్లు వివరించారు. ఆలయంతో పాటు కైలాసగిరుల్లోని ఆలయాలను దర్శించుకునే విధంగా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇక భరద్వాజ తీర్థంలో శిధిలమైన నందీశ్వరుని స్థానంలో కొత్త నందిని ప్రతిష్టించుటకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కైలాసగిరులను అద్భుతంగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో, ముందుచూపుతో శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి కైలాసగిరి చుట్టూ 21 కిలో మీటర్లు రూ.18కోట్లతో సిమెంటు రోడ్డును ఏర్పాటు చేసారని తెలిపారు. అలాగే హర హర తీర్థంలో ప్రకృతి అందాలు భిన్నం కాకుండా శోభాయమాంగా తీర్చి దిద్దుటకు భక్తులు ఇక్కడ కొంత సేపు సెద తీరటానికి మండపాన్ని నిర్మించాలని కూడా ఇంజనీరింగ్ విభాగం అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించినట్లు చైర్మెన్ వివరించారు. ఆయనతో పాటు పరిశీలనల్లో ఇంజనీరింగ్ సిబ్బంది హరి, కుమార్, వేణు, కుమారస్వామి, నరసింహ, మురళిలతో పాటు స్థానిక అనుభవం ఉన్న భక్తులు పాల్గొన్నారు.



హర హర తీర్థంను పరిశీలిస్తున్న చైర్మెన్ శ్రీనివాసులు



## వదలని వానలతో సాగని వ్యవసాయ పనులు

### దిక్కుతోచని స్థితిలో విలీన మండలాల రైతులు

### దుక్కులు చెయ్యడానికి అనువుకాని పరిస్థితి

**కూనవరం, అక్టోబర్ 17, ప్రభాతవార్త:** విలీన మండలాల్లో గోదావరి వరదల అనంతరం వదలని వానలతో వ్యవసాయం ముందుకు సాగని పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది వరదలు నాలుగు పర్యాయాలు రావడం, అనంతరం ఎడతెరిపి లేకుండా వర్షాల కారణంగా కూనవరం, విఆర్‌పురం, చింతూరు, ఎటపాక మండలాల్లోని కొన్ని వ్యవసాయ భూముల్లో దుక్కులు చెయ్యని పరిస్థితి నెలకొంది. ఈ మండలాల్లో ప్రధానంగా వాణిజ్య పంటలైన మిర్చి, లంక పొగాకు, పత్తి పంటలతో పాటు ఆహార ధాన్యాలు పెసరి, మినుము, కంది, వరి, తదితర పంటలు పండిస్తారు. పోలవరం కాఫర్ డ్యాం కారణంగా వరదల సమయంలో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండటం జరిగింది. వరదలు తగ్గిన వెంట వెంటనే వర్షాలు రావడం కారణంగా పోలాల్లో దుక్కులు చెయ్యలేని పరిస్థితి ఏర్పడింది. మిర్చి సాగు కోసం లంక పొగాకు సాగుకోసం రైతులు వేసిన నారుముళ్ళు పెరిగిపోవడం జరుగుతుంది. పెరిగిన నారును వేస్తే దిగుబడి రాదని రైతులు అంటున్నారు.

ఇదే పరిస్థితి లంక పోగాకు నారుముళ్ళలో కూడా కొనసాగుతోంది. పెరిగిన నారు ఏమాత్రం పనికివస్తుందో.. రాదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో సారవంతమైన నేలలు ఉండటం, మిర్చి పంటకు అనుకూలంగా ఉండటం కారణంగా ఎక్కువ మంది రైతులు మిర్చిని సాగు చేస్తారు. ఎకరానికి లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి మిర్చి, లంక పోగాకు సాగు చేసు_ంటారు. మిర్చి పంట ఇప్పటికే మొక్కవేత పూర్తి చేసి, పైపాటుకు మొక్కలు పెరగాల్సి ఉందని, కాని నేటికి వర్షాల కారణంగా దుక్కులు చేసిన పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. ఇక ఆహార ధాన్యాలు మినుము, పెసర, కంది, మొక్కజొన్న పంటలు వేసే సమయం ఆసన్నమైనా పోలాలు ఎండకపోవపడం వల్ల దుక్కులు కూడా చెయ్యలేదు. ప్రత్తి పంట పండించే రైతుల పరిస్థితి కూడా ఈ విధంగానే ఉంది. వదలని వర్షాల కారణంగా వ్యవసాయ పనులు ముందుకు సాగక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇదిలా ఉండగా మళ్ళీ ఆంధ్రకు తుఫాన్ వాయుగుండం రాగలదని సిత్రాంగ్‌గా నామకరణం చెయ్యడం జరిగిందన్న వార్తలతో రైతాంగం దిగులు చెందుతున్నారు. ఏది ఏమైనా ఈ ఏడాది రైతులకు పరిస్థితులు అనుకూలంగా లేవని చెప్పవచ్చు.

## మార్చి 23 నాటికి టిడ్కో ఇళ్లు పూర్తి

### లబ్దిదారులకు అప్పగింత

### రుణం చెల్లించటానికి కొందరు విముఖత

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 17 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేపట్టినే ఎన్ టి ఆర్ భరోసా ' పథకం ఇళ్ళ అప్పగింతలో ప్రస్తుత సర్కార్ కసరత్తు చేస్తుంది. 2019 నాటికి అర్ధాంతరంగా ఆగిన ఇళ్ళకు పూర్తి స్థాయి సామర్థ్యం కల్పించి మార్చి 23 నాటికి అప్పగించుటకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే గతంలో సొమ్ములు చెల్లించిన కొందరు లబ్దిదారులు బ్యాంకు రుణం చెల్లించటానికి తమకు స్థోమత లేదని రాతమూలకంగా ఇస్తున్నారు. అలాంటి వారికి సొమ్ములు వాపసు ఇవ్వటానికి సాధ్యాసాధ్యాలను అధికారులు పరిశీలిస్తున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్టర్లు పనులు ఆపేసారు. ఇలా మూడేళ్ళు గడిచింది, ప్రభుత్వం వత్తిడితో అధికారులు పరుగులు తీస్తున్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు ముగ్గురు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి చకచకా పూర్తి చేయటానికి కృషి చేస్తున్నారు. మొదట డిసెంబర్ ఆఖరుకు పూర్తి చేయాలని భావించారు. కానీ పనులుకు వర్షాకాలం అడ్డుగా ఉన్నందువల్ల మార్చి నాటికి అందించుటకు యుద్ధ ప్రాతిపదికపై పనులు సాగిస్తున్నారు. కొత్తగా ప్రస్తుతం ప్రారంభం కాని ఇళ్ళ డిడిలు వాపసు తీసుకెళ్ళాలని అపిట్‌కో అధికారులు లబ్దిదారులకు చెబుతుండటంతో ఆందోళన చోటు చేసుకుంది. ఐదేళ్ళ క్రితం అప్పులు చేసి వడ్డీలకు సొమ్ములు తెచ్చి డిడిలు అందిస్తే ఇప్పుడు సాధ్యం కాదంటే ఎలా అని లబ్దిదారులు వాపోతున్నారు. ఇంత కాలం చెల్లించిన వడ్డీ ఏమైందని ప్రశ్నిస్తున్నారు. అయితే పూర్తి అయిన ఇళ్ళ అప్పగింతకు సంబంధించి పరిశీలనల మీద పరిశీలనలు వీరు అర్హులా? కాదా? అని సర్వేలు జరిగి ఖరారు చేసారు.

**శ్రీకాళహస్తిలో ఇళ్ల పయనమెటు సాగింది?!**

శ్రీకాళహస్తి నియోజకవర్గ కేంద్రంలో ఎన్ని పట్టాలిచ్చినా, ఎన్ని పక్కా గృహాలు నిర్మించినా లబ్దిదారుల సమస్య తీరటం లేదు. 2004కు ముందు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సుమారు 5వేల పట్టాలు మంజూరు చేశారు. 2004లో డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి అధికారానికి వచ్చిన తరువాత స్థానిక శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు 7వేల పట్టాలు, పక్కాగృహాలకు సంబంధించి భూమి కొనుగోలు చేసి రాజీవ్‌నగర్‌ను నిర్మించారు. తరువాత 2014లో



అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం సర్కార్ ఇక్కడే ఎన్‌టిఆర్ భరోసా పథకంలో అందరికి ఇళ్ళను ఇవ్వాలని ప్రజల భాగస్వామ్యంతో అపార్టు మెంటులను నిర్మించుటకు నిర్ణయించారు. ప్రజల భాగస్వామ్యానికి సంబంధించిన సొమ్ములకు డిడిలు తీసుకున్నారు. ఇక్కడ మొత్తం6015 మంది లబ్దిదారుల్ని ఎంపిక చేశారు. అపార్టుమెంట్ నిర్మాణానికి టెండర్లు పిలిచి నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ వారికి అప్పగించారు. ఇందులో డబుల్‌బెడ్‌రూం లబ్దిదారులకు రూ.7లక్షల విలువ చేసే ఇంటిని ఇస్తారు. ఇందులో రూ.1లక్ష లబ్దిదారుడు డిడి చెల్_ంచాలి, ఇలా 2వేల మంది సొమ్ములు చెల్లించారు. తరువాత రూ.50వేల సింగిల్ బెడ్‌రూంలను నిర్మించుటకు సామాన్యమైన లబ్దిదారులకు రూ.500ల సొమ్ములతో నిర్మించుటకు నిర్ణయించారు. ఈ మేరకు టెండర్లు పిలిచి 6015 ఇళ్ళు నిర్మించుటకు కాంట్రాక్టర్‌కు 2016లో అప్పగించారు. టెండర్ దారునికి 5984 ఇళ్ళ నిర్మాణానికి టెండర్లు పిలిచి నిర్ధారించారు. ఈ నిర్మాణాలకు లబ్దిదారులు 5244 మంది డిడిలు చెల్_ంచినట్లు అప్పటిలో అధికారులు తెలిపారు. మొదటి దశలో 2912 ఇళ్ళను పూర్తి చేశారు. అయితే ఇక్కడ మౌలిక సదుపాయాలు రోడ్లు, ఇళ్ల కిటికీలు, విద్యుత్ సదుపాయం కల్పించాల్సి ఉంది.

**దేశం హయాంలోనే పలు సార్లు పరిశీలనలు:**

ఎవరైతే లబ్దిదారుల్ని ఎంపిక చేసి మంజూరు చేశారో వారి హయాంలోనే పలుమార్లు అర్హుల జాబితాల్ని మళ్ళీ మళ్ళీ పరిశీలించారు. మొదట ఎవరి వద్ద అయితే డిడిలు తీసుకున్నారో వారిలో కూడా అనర్హులున్నారని నిర్ధారించారు. పలు అంక్షలు విధించారు. రెండవ ఫేస్‌లో 3099 ఇళ్ళకు అర్హులని ప్రకటించారు. ఇందులో 50శాతం పూర్తి అయినట్లు రికార్డు చేశారు. మూడవ దశ ఇళ్ల మంజూరు కాలేదు. అయితే డిడిలు తీసుకున్నారు. ఎన్నికలకు ముందు 2018 ఉగాదికే ఇళ్ళు ప్రారంభం అని ప్రకటించారు. కానీ జరగలేదు. తరువాత 2019 సంక్రాంతికి ప్రారంభం అని ప్రకటించారు. అయినా లబ్దిదారులకు అందించలేదు. నిర్మించిన ఇళ్ళకు సంబంధించి కేటాయింపులో పలు నిబంధనలతో డిప్ పద్ధతిలో ఎవరెవరికి ఏఏ ఇల్లు అనేది నిర్ధారించి నిర్ధారించారు. దీనికి పెద్ద పండగ అన్నట్లు లబ్దిదారుల్ని ఊరించారు.

**కదలిన పక్కాగృహాల నిర్మాణం: మౌలిక సదుపాయాలకు ఏర్పాట్లు:**

జుప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 40నెలలు కావస్తుంది. గతంలో చేపట్టిన పనులుకు సంబంధించి రీటెండరింగ్‌కు ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో కాంట్రాక్టర్ మానుకున్నారు. ఇక్కడ పనులు 75 శాతం పూర్తి అయినా కాంట్రాక్టర్ కంపెనీ ముందుకు రాలేదు. ప్రస్తుతం పూర్తి అయిన ఇళ్ళకు సంబంధించి 4464 మంది అర్హతను బ్యాంకు లింకేజీతో కంప్యూటరీకరణ చేశారు. ఇక పునాదుల స్థాయిలో ఉన్న 1632 మంది లబ్దిదారులు చెల్లించిన డిడిలను తీసుకోవాలని టిట్‌కో అధికారులు సూచిస్తున్నారు. అయితే ఇందులో అర్హులుంటే వారికి ప్రభుత్వమే ఉచింతంగా ఇళ్ళ స్థలాలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇలా రూ.లక్ష డిడిలు చెల్_ంచిన వారు సుమారు 400 మంది ఉన్నారు. అలాగే రూ.50వేలు చెల్లించిన లబ్దిదారులు 300 మంది ఉన్నారు. వారి డిడిలు వాపసు తీసుకోవాలని సూచిస్తున్నారు. దాంతో లబ్దిదారుల్లో తీవ్ర నిరాశ నిస్ర్పహలు చోటు చేసుకున్నాయి. డిడిలు అప్పగించి ఐదేళ్ళ తరువాత మీకు ఇళ్ళు లేవంటే ఎలా అని వాపోతున్నారు. అయితే ఈ లబ్దిదారులకు న్యాయంచేయాలంటే స్థలంలేదు. ప్రభుత్వం కొనుగోలు చేయాలి. ప్రస్తుతం భూములరేట్లుఆకాశంలో చుక్కలు చూపిస్తున్నాయి. మరి వీరి పరిస్థితి ఏమిటో ఏమో? ముక్కంటీశునికే ఎరుక.

**కమిషనర్ వివరణ:** శ్రీకాళహస్తి పొలిమేరల్లో నిర్మించిన 6వేల పక్కాగృహాలకు మౌలిక సదుపాయాల కల్పనకు ముగ్గురు కాంట్రాక్టర్లకు బాధ్యత అప్పగించినట్లు కమిషనర్ బి.బాలాజి నాయక్ వివరించారు. ఇక కొందరు తాము బ్యాంకు రుణం తీర్చే స్థోమత లేదని మానుకున్నారని అలాంటి వారు 160 మంది ఉన్నారని తెలిపారు. ఒక కాంట్రాక్టర్‌కు రోడ్డ పనులు, మరో కాంట్రాక్టర్‌కు ఎస్‌టిపి, ఇంకొక కాంట్రాక్టర్‌కు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నామన్నారు. మార్చి 2023 నాటికి లబ్దిదారులకు అప్పగించుటకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

వార్త

ప్రజాస్వామ్యం, సోషలిజం రెండూ మార్గాలే కానీ గమ్యాలు కావు.

-నెహ్రూ

# ఇంకెన్నాళ్లీ కష్టాల సాగు?

తెలుగు రాష్ట్రాల ప్రజానీకాన్ని వర్షాలు, వరదలు ముంచెత్తుతున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా వరుణదేవుడు విరుచుకుపడడంతో అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇటు తెలంగాణలోనూ వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రధానంగా మెట్టపంటలు ఇప్పటికే దెబ్బతిన్నాయి. గోదావరి, కృష్ణాతోపాటు చిన్నచిన్న నదులు, వాగులు, వంకలు, పొంగి పొర్లడంతో వందలాది గ్రామాలు జలమయ్యమయ్యాయి. నిత్యం కరవుతో అల్లాడే రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లోని గ్రామాల్లో నీరు ప్రవేశించింది. శాశ్వత కరవు నిలయమైన పాలమూరు జిల్లాలో ఈసారి ఎడతెరపి లేకుండా పడుతున్న వర్షాలు, కుంభవృష్టితో అనేక ప్రాంతాలు వరద తాకిడికి గుర య్యాయి. రాజధాని నగరం హైదరాబాద్‌ను కూడా వానదేవుడు వదిలిపెట్టలేదు. తెలుగు రాష్ట్రాల్లో కోట్లాది రూపాయల విలువచేసే రహదారులు దెబ్బతిన్నాయి. ప్రకృతితోపాటు ప్రభుత్వాలు కూడా ప్రజానీకంతో ఆడుతున్న నాటకాల దుష్ఫలితం ఇది. వేడిసోకిన మైనం ముద్దలాగా నీటితడి తగలగానే చెరువుకట్టలు తెగడం, కాలువలకు గండ్లుపడడం, రోడ్లు కొట్టుకుపోవడం మనిషికి మనిషి చేస్తున్న ద్రోహం. రాజకీయజోక్యం కొందరి ఇంజినీర్ల అసమర్థత, అవినీతి, కాంట్రాక్టుల కక్కుర్తి వల్ల వందలాది నీటివనరులు నిరుపయోగంగా మిగిలిపోతున్నాయి. ఇప్పటికే పంటలకు అపారనష్టం జరిగింది. ఇప్పుడు తెలంగాణలో వానాకాలం పంటలు కోతల దశకు వచ్చాయి. పత్తి ఏరివేత అక్కడక్కడ ఆరంభమయింది. అయినా వర్షాలు వదిలిపెట్టకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవంగా చూసినా ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుండి వర్షాలు ఆరంభమయ్యాయనే చెప్పొచ్చు. అప్పటి నుండి తెలుగు రాష్ట్రాల్లో ఏదోఒక ప్రాంతంలో ప్రతిరోజూ వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. కొన్ని చోట్ల ముసుర్లతో పరిమితం కాగా, మరికొన్ని ప్రాంతాల్లో కుంభవృష్టి కురుస్తున్నది. ఇప్పుడు వరి, మెట్టపంటల కోతలు రైతులకు సమస్యగా మారిపోయింది. పోనీ వరిపంటను అలాగే కొంతకాలం ఉంచితే ధాన్యం రంగు మారుతుంది. ఆదిలాబాద్ జిల్లాలో కోతకు వచ్చిన సోయాపంటను పొలాల్లోనే వదిలివేస్తున్నారు. పత్తి తీసే దశకు చేరుకున్నా వర్షాలతో రైతులు ముందుకు అడుగువేయలేకపోతున్నారు. ఈ యేడాది వానాకాలంలో కోటినలభైమూడు లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయాలని అధికారవర్గాలు నిర్ణయించాయి. గతంలో ఎన్నడూలేని విధంగా రికార్డు స్థాయిలో వరి పంట సాగు అయింది. వరిసాగు లక్ష్యం నలభైఐదు లక్షల ఎకరాలు కాగా, లక్ష్యాన్ని మించి దాదాపు మొత్తం అరవైనాలుగు లక్షల యాభైవేల ఎకరాల్లో వరిసాగు చేశారు. పత్తి డెబ్బైలక్షల ఎకరాలు సాగు చేయాలని అధికారులు నిర్ణయిస్తే యాభై లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు అయింది. పత్తి దిగుబడి గణనీయంగా తగ్గే పరిస్థితి కన్పిస్తుంది. ఇక మొక్కజొన్న రైతుల పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. వర్షాలకు తడవడంతో మొలకలు వస్తున్నాయి. మొత్తం మీద అధికవర్షాలు, వరదలతో పంటలకు భారీ నష్టం ఇప్పటికే జరిగింది. రాబోయే వారం పదిరోజుల్లో మరిన్ని భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వార్తలు రైతులను కుదిపేస్తున్నాయి. ఉత్తర అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాగల నాలుగు రోజుల్లో తేలిక పాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాస్త్రజ్ఞులు అంచనా వేస్తున్నారు. మరొకపక్క కోస్తాకు తుఫాన్ గండం పొంచి ఉందని వాతావరణ శాఖ తాజాగా హెచ్చరించింది. రాబోయే రెండు రోజుల్లో అండమాన్ సముద్రం పరిసరాల్లో ఏర్పడనున్న అల్పపీడనం, వాయుగుండంగా, తుఫాన్‌గా బలపడి ఈ నెల 22 తర్వాత కోస్తా దిశగా వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇక పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న వాయుగుండం థాయిలాండ్ మీదుగా ఈ నెల 18కల్లా ఉత్తర అండమాన్ సముద్రంలోకి ప్రవేశించి ఉపరితల ఆవర్తనంగా మారే అవకాశం ఉందని మరొక అంచనా. ఇది పశ్చిమ వాయువుగా ప్రయాణించి క్రమంగా బలపడి వాయుగుండంగా ఆ తర్వాత తుఫాన్‌గా మారుతుందని వాతావరణ శాఖ చెప్తున్నది. మొత్తం మీద తెలుగు రాష్ట్రాల్లో వానలు ఆగడం లేదు. మరికొంతకాలం కొనసాగే అవకాశం ఉన్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులకు దిక్కుతోచడం లేదు. ఇప్పటికే ఈ వానాకాలంలోనే రైతుల బలవన్మరణాలు నిత్యకృత్యమైపోయాయి. పంటలు విఫలమైతే పెట్టిన పెట్టుబడి రాక, తిరిగి అప్పుపుట్టక, వడ్డీవ్యాపారుల ఒత్తిడి తట్టుకోలేక ప్రాణాలు తీసుకుంటున్నారు. ఈ పరిస్థితి ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చింది కాకపోయినా గత రెండు,మూడు దశాబ్దాలుగా వ్యవసాయ రంగాన్ని పాలకులు నిర్లక్ష్యం చేయడం, పొరుగనే ఉన్న జపాన్, చైనా, తైవాన్, కొరియా లాంటి దేశాలు వ్యవసాయరంగంలో నూతన పరిశోధనల ద్వారా పంటల దిగుబడి పెంచడమేకాక, వ్యవసాయాన్ని లాభసాటి వ్యాపకంగా మార్చుకుంటుంటే మనం మాత్రం వ్యవసాయ పరిశోధనలను పాడుపెట్టి, మూడు దశాబ్దాల నాటి కాలంచెల్లిన వంగడాలతో పొద్దుబుచ్చుతున్నాం. ఎరువులు,పురుగుమందులు వాడకంలో మెలుకువలు కనిపెట్టడం లేదు. కనిపెట్టినా అవి రైతులకు అందుబాటులోకి తీసుకురాలేకపోతున్నారు. వ్యవసాయాన్ని ఆధునీకరించడానికి విస్తృతస్థాయిలో చర్యలు చేపట్టాలి. అదొక ఉద్యమ స్థాయిలో జరిగితే తప్ప గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడే పరిస్థితి కన్పించడం లేదు.

> పరుగులెత్తించే ప్రతిపక్షమే ప్రజాప్రభుత్వానికి భద్రత చేకూరుస్తుంది.



బెంజమిన్ డిజ్రాయెలి

> చెవిటి ప్రభుత్వం, మూగ ప్రజలు ఉంటే ప్రజాస్వామ్యం వర్ధిల్లలేదు.



రాజగోపాలాచారి

## ప్రజావాక్కు



### ఇవేం దారుణాలు

పట్టణాలలో రోడ్లన్నీ అధ్వాన్నంగా తయారయ్యాయి. ముఖ్యంగా బస్తీలలో మరీ దారుణంగా ఉన్నాయి. చినుకుపడితే చాలు రహదారులన్నీ చెరువులను తలపిస్తాయి. దీని ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులన్నీ కంకర తేలి ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తూ ప్రజల ఒళ్లును, వాహనాలను గుల్ల చేస్తున్నాయి. గతుకుల రోడ్లు చిన్న వర్షానికే బురద గుంటలా మారుతున్నాయి. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ప్రమాదాల బారిన పడటం జరుగుతోంది. ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. రోడ్లకు వందల కోట్లుఖర్చు చేస్తున్నామని ఆర్భా ప్రకటనలు చేస్తున్నారే తప్ప క్షేత్ర స్థాయిలో చూస్తే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్లను బాగు చేయించడంలో చొరవ చూపాలి.

-కాయల నాగేంద్ర, హైదరాబాద్

### తీర్మానం ఎందుకు ఉపసంహరించుకున్నారు?

రాష్ట్రరాజధాని విషయంలో పాలకుల తీరు పూర్తిగా బాధ్యతారాహిత్యంగా ఉంది.ఎన్నికలకు ముందుఅమరావతే రాజధాని అన్నారు. వచ్చిన తర్వాత మూడు రాజధానులంటూ అసెంబ్లీలో తీర్మానంచేశారు. మరల తీర్మానాన్ని ఉపసంహరించుకుని అదే విషయం న్యాయస్థానానికి తెలిపారు. మూడు రాజధానులు కావాలంటూ తుళ్లూరులో ఓ శిబిరాన్ని పెట్టి తామాషా చేశారు. ఇప్పుడా శిబిరంలేదు. అక్కడ కావాలని ఆందోళన చేసే వారులేరు. మరల విశాఖలో మూడు రాజధానులు అంటూ కొత్త డ్రామాకు తెరలేపారు. మీ నాటకాలన్నీ ప్రజలు గమనిస్తున్నారు. మూడు రాజధానులు అంటున్న మూడు ప్రాంతాలలో ఎక్కడైనా ఆ దిశగా అభివృద్ధి జరిగిందా? ప్రజల ను ఎల్లకాలం మభ్యపెట్టలేమన్న వాస్తవాన్ని గుర్తించకపోతే భంగపాటు తప్పదు.

-కంభంపాటి కోటేశ్వరరావు, విశాఖపట్నం

### సైబర్ వల

ఈమధ్య కొందరు మోసగాళ్లు కేవైసి (నో యువర్ కస్టమర్) డిటేయిల్స్ అప్‌డేట్ చేసుకోవాలని లింకులు పంపిస్తూ, లేదంటే బ్యాంక్ అకౌంట్ బ్లాక్ అవుతుందని భయపెడుతూ బురిడీ కొట్టిస్తున్నారు. పొరపాటున ఎవరైనా ఆ లింకులు తెరచి తమ వివరాలు పొందుపరిచిన వెంటనే వారి ఖాతాలోని డబ్బులు కాజేస్తున్నారు. కాబట్టి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి. ఆ మాయగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### రైతులను అవమానపరచడం సరికాదు!

అమరావతి రాజధాని రైతులయాత్ర న్యాయస్థానం అనుమతితో, రైతులు పోలీసుల గుర్తింపు కార్డులతో యాత్ర చేస్తుంటే కొంత మంది ఫేక్‌రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు అంటూ ప్లకార్డులు, నల్ల బెలూన్లతో ఘర్షణ వాతావరణం సృష్టించడం సరైన విధానంకాదు.ఇదిరైతులను అవమానించడమే. అందరూ ఆమోదించిన తరువాతేరైతులు భూములు ఇచ్చారు. ప్రభుత్వం రైతులతో చేసుకున్న ఒప్పందం షరతులను ప్రభుత్వం ఉల్లంఘించడం ధర్మకాదు. వారుచేస్తున్నది అరసవల్లి సూర్యభగవానుని న్యాయం చేయమని వేడుకోవడానికే చేస్తున్న పాదయాత్ర. దానికి వక్రభాషాలు చెప్పి,ప్రజలను తప్పుదారి పట్టించే కుయుక్తులు సమాజానికి మంచిది కాదు. విశ్వసనీయత లేని పాలకుల వలన ఆ రైతులే కాదు, రాష్ట్ర ప్రజానీకం మొత్తం నష్టపోతున్నది. ఈ వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరుజిల్లా

### ప్రచారానికే పథకాలు!

రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను మరింత మెరుగ్గా అమలు చేస్తామని వాగ్దానం చేసి అమలు చేయకుండా అటకెక్కించింది. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్నందునా, ఆయాలబ్దిదారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతోనూ మరల అమలు చేయడానికి తెరలేపారు. అయితే ఆయా పథకాలకు బడ్జెట్ కేటాయింపులు లేవు. ఇప్పటికే అమలులో ఉన్న పథకాల అమలుకు అప్పు తీసుకువస్తున్నారు. ఈ నేపథ్యంలో అర్హులను ఎంపిక చేయడానికి ఆచరణసాధ్యంకాని అనేక నిబంధనలు పెట్టి మసిపూసిమారేడు కాయ చేస్తున్నారు. ఈనిబంధనలతో ఆశపడి వస్తున్నవారు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి నిరాశగా వెనుదిరుగుతున్నారు. ప్రచారం కోసం తప్పితే పేదల సంక్షేమం నీటి మీద రాతలే!

-జి.భారతీదేవి, ఏలూరు, ఏలూరుజిల్లా

### కోర్టు అనుమతి అవసరం లేదా?

అమరావతి రైతుల పాదయాత్రను అడ్డుకోవద్దు, వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేసుకోమని వైకాపా వారికి రాష్ట్ర డిజిపి విన్నవిస్తున్నారు.రైతుల పాదయాత్రకు పోలీసులు శాంతి భద్రతలు నెపంతో అనుమతి ఇవ్వలేదు. రైతులు కోర్టు అనుమతి తెచ్చుకునే పాదయాత్ర చేస్తున్నారు. మరి నిరసన ప్రదర్శనలకు పోలీసులు ఎలా అనుమతి ఇస్తారు? పోలీసులు చెప్పిన శాంతి భద్రతల సమస్య ఏమైనట్లు? నిరసన ప్రదర్శనలు చేయడానికి కోర్టు అనుమతి అవసరం లేదా? ఇదెక్కడి ద్వంద్వ నీతి?

-జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణాజిల్లా

# వ్యవసాయ బోర్లకు మీటర్ల ఏర్పాటు సబబేనా?

**పెట్రోలు, డీజిల్, రవాణా రేట్లు, వ్యవసాయ పెట్టుబడి రెట్టింపు అయ్యాయి. దిగుబడి, గిట్టుబాటు ధరలు తగ్గాయి. రాబోయే రోజులలో వ్యవసాయం కష్టంగా మారుతున్నది. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరోవైపు అతివృష్టి అనావృష్టి తో పంట నష్టం ఎక్కువగా ఉంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ మీటర్లను బిగించేందుకు సిద్ధమవ్వడం దుర్మార్గమైన చర్య. రైతులు వినియోగించే విద్యుత్‌కు అయ్యే ఖర్చును రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉంది. రైతులకు 9 గంటలు విద్యుత్ అందించాల్సిందిపోయి, 7గంటలు మాత్రమే అందిస్తున్నారు. రైతులు విద్యుత్ సంస్కరణలు క్షుణ్ణంగా అధ్యయనం చేసి వాటిని ఉపసంహరించుకునే వరకు ఉద్యమబాట పట్టాలి.**

డాక్టర్ యం. సురేష్‌బాబు

మాది రైతు సంక్షేమ ప్రభుత్వం అని జబ్బలు చరుచుకునే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. కేంద్రం దగ్గర అప్పుపుడితే చాలు సంస్కరణల పేరుతో రైతులకు ఉరితాళ్లు బిగించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. మూడున్నర సంవత్సరాల క్రింద అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసి ఆర్థిక, సాంకేతిక, సుస్థిరమైన శక్తివంతమైన సమర్థవంతమైన వ్యవస్థను రూపొందించాలి అన్న మాటలకు విరుద్ధంగా పనిచేస్తున్నది.మొదట్లో మేకపోతు గంభీర్యం ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం క్రమంగా కేంద్రం ప్రవేశపెట్టిన సంస్కరణల్లో భాగమయింది. నిర్దేశిత మూడు విద్యుత్ సంస్కరణలు అమలు చేసి, మధ్యప్రదేశ్ తర్వాత విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు చేసిన రెండో రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. తద్వారా జిఎస్‌డిపిలో 0.15 శాతం మేర అంటే రూ.1,515కోట్ల మేర అదనపు రుణాలు స్వీకరించేందుకు కేంద్ర ఆర్థికశాఖ అనుమతి పొందింది. కొవిడ్ మహమ్మారి ఆర్థిక వ్యవస్థపై చూపిన ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వీలుగా జిఎస్‌డిపిలో రెండు శాతం అదనంగా రుణాలు తీసుకునేందుకు పరిమితిని పెంచింది. అయితే ఇందులో 1 శాతానికి షరతులు విధించింది. పౌర కేంద్రీకృత సంస్కరణలు అమలు చేస్తే ఈ ఒక శాతం రుణ పరిమితినీ వాడుకోవచ్చని పేర్కొంది.విద్యుత్ సంస్కరణలు మూడింటలో ఒకటైన విద్యుత్ సబ్సిడీల ప్రత్యక్ష నగదు బదలీని 2020 డిసెంబర్ 31లోపు ఒక్క జిల్లాలోనైనా పూర్తి చేస్తే జిఎస్‌డిపిలో 0.15 శాతం మేర అదనపు రుణాలు అర్హత లభిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ సంస్కరణలను అమలు చేసింది. 2020 సెప్టెంబర్ నుంచి విద్యుత్ రాయితీలను ప్రత్యక్ష నగదు బదలీ ద్వారా ఇస్తూ శ్రీకాకుళం జిల్లా నుంచి శ్రీకారం చుట్టింది. ఏప్రిల్ ఒకటి కల్లా అన్ని జిల్లాల్లో ఇలాగే అమలు చేయనుంది. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ అమలు చేసిన సంస్కరణల కారణంగా రూ.9,190 కోట్ల మేర అదనపు రుణాలకు అర్హత లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మరో వెసులుబాటు కల్పించింది. ఏపితోపాటు పది రాష్ట్రాలకు అదనంగా అప్పులు చేసుకునేందుకు కేంద్రం అమనుతిచ్చింది. విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తున్నందుకు వీలుగా ఈ వెసులుబాటు కల్పించింది. మొత్తంగా పది రాష్ట్రాలకు రూ. 28,204 కోట్లు అదనపు అప్పులు చేయడానికి అనుమతి ఇచ్చింది. విద్యుత్ సంస్కరణలు అమలు చేసిన రాష్ట్రాలకు మాత్రమే ఎఫ్ఆర్‌బిఎం పరిమితి అరశాతం పెంచినట్లు తెలుస్తోంది. కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించింది. అదనంగా అప్పు చేసేందుకు కేంద్రం అనుమతి ఇవ్వకపోయినా, విద్యుత్ సంస్కరణల్లో భాగంగా వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేది లేదని సిఎం కెసిఆర్ స్పష్టం చేశారు. సుమారు 25వేల కోట్ల నష్టం వచ్చినప్పటికీ తాము కేంద్ర విద్యుత్ సంస్కరణలను అమలు చేయలేమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే అదనంగా అప్పులు చేసుకునేందుకు అనుమతిచ్చిన రాష్ట్రాల జాబితాలో తెలంగాణ రాష్ట్రం లేదని తెలుస్తోంది. విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చేందుకు ముందుకు రాని రాష్ట్రాలకు రుణాలివ్వడం నిలిపివేయాలని కేంద్రప్రభుత్వం ఆర్థిక



సంస్థలను ఆదేశించింది. తెలంగాణ జెన్‌కోకు జాతీయ విద్యుత్ ఆర్థికసంస్థ (పిఎఫ్‌సి), గ్రామీణ విద్యుత్ విద్యుదీకరణ సంస్థ (ఆర్ఇసి)ల నుంచి రూ.20వేల కోట్ల రుణాల పంపిణీ నిలిచిపోయింది. కేంద్రప్రభుత్వ నూతన సంస్కరణలు రైతుల పాలిట శాపంగా మారనున్నాయా? అంటే అవుననే సమాధానమేవస్తోంది. కేంద్రం చెప్పిన సంస్కరణలు అమలు చేస్తేనే రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు అందుతుండడంతో ఈ సంస్కరణలు తప్పనిసరి అయ్యాయి. ఆత్మనిర్భర్ భారత్ పథకం కింద రుణాల కోసం ఈ నిబంధనలు తప్పనిసరిగా మారాయి. ఇన్నాళ్లు రైతులకు ఉచిత విద్యుత్ అందగా కేంద్ర సంస్కరణలతో మోటార్లకు మీటర్లు బిగించనున్నారు. దీంతో వ్యవసాయ విద్యుత్‌కు ఇక నుంచి లెక్క పక్కా కానుంది. ఇప్పటికే విద్యుత్ సంస్థలు రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ విద్యుత్ లెక్కను తేల్చేపనిలో నిమగ్నమయ్యాయి. ఇప్పటికే వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ అందించే ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్ల బిగింపు కార్యక్రమం మొదలైంది. ఈనేపథ్యంలో వ్యవసాయ బోర్లకు మీటర్లను బిగిస్తే రైతులకు ఉచిత విద్యుత్ అందుతుందా? లేదా? మీటర్లు బిగిస్తే రైతులు బిల్లులు చెల్లించాల్సిందేనా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లకు మీటర్లు బిగిస్తే ఒక్కో బోరు మోటారు ఎంత విద్యుత్‌ను వినియోగిస్తోందన్న లెక్కలు తేలడంతోపాటు అందుకు సంబంధించిన బిల్లులు సైతం రానున్నాయి. దీంతో రైతులకు కొత్త చిక్కులు ఎదురుకానున్నాయి. గతంలో 2004కు మునుపు రైతులు సర్‌ఛార్జీలు, ఇతర ఛార్జీలను వ్యవసాయ బోర్లకు చెల్లించేవారు. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు ఉచిత విద్యుత్ పేరిట అన్నింటినీ మాఫీ చేసింది.2004 నుంచి ఇప్పటి వరకు రైతులకు ఉచిత విద్యుత్ పథకం కొనసాగుతూ వస్తోంది.వ్యవసాయ బోర్లకు రైతులు నయాపైసా చెల్లించకుండా పంటలు పండించుకుంటున్నారు. కానీ అలాంటిది తాజాగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ట్రాన్స్‌ఫార్మర్‌లకు మీటర్లను బిగించే ప్రక్రియ మొదలై రైతులకు ఇబ్బందికరంగా మారుతోంది. ఈ కొత్త నిబంధనలు ఉచిత విద్యుత్‌కు దూరం చేస్తాయా? అన్న సందేహాలను కలిగిస్తున్నాయి. కేంద్రం తానా అంటే రాష్ట్ర ప్రభుత్వం తందానా అంటున్నది. రైతులకు ఉచిత విద్యుత్ అమలు చేయకుండా బిల్లుల భారం తప్పదని ప్రజలు గ్రహించాలి. మీటర్ల బిగింపు ప్రక్రియ మొదలు కావడంతో రైతుల్లో దడమొదలైంది. అయితే ఉచిత విద్యుత్‌కు బ్రేకులు పడితే కేంద్రప్రభుత్వంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఎంతైనా ఉంది. బిజెపి ప్రభుత్వం గద్దె నెక్కేందుకు బూటకపు హామీలు ఇచ్చి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న ప్రభుత్వం అందుకు విరుద్ధంగా నడుచుకుంటుంది. పెట్రోలు, డీజిల్, రవాణా రేట్లు, వ్యవసాయ పెట్టుబడి రెట్టింపు అయ్యాయి. దిగుబడి, గిట్టుబాటు ధరలు తగ్గాయి. రాబోయే రోజులలో వ్యవసాయం కష్టంగా మారుతున్నది. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరోవైపు అతివృష్టి అనావృష్టి తో పంట నష్టం ఎక్కువగా ఉంది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ మీటర్లను బిగించేందుకు సిద్ధమవ్వడం దుర్మార్గమైన చర్య. రైతులు వినియోగించే విద్యుత్‌కు అయ్యే ఖర్చును రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉంది. రైతులకు 9 గంటలు విద్యుత్ అందించాల్సిందిపోయి, 7గంటలు మాత్రమే అందిస్తున్నారు. రైతులు విద్యుత్ సంస్కరణలు క్షుణ్ణంగా అధ్యయనం చేసి వాటిని ఉపసంహరించుకునే వరకు ఉద్యమబాట పట్టాలి. ●

# సామాజిక మాధ్యమాలకు బానిసలుగా యువత

కామిడి సతీష్‌రెడ్డి

నేడు యువత సామాజిక మాధ్యమాల బారినపడి విలువైన భవిష్యత్‌ని సర్వనాశనం చేసుకుంటూ ఉన్నారు. కొంత మందికి క్రికెట్ పిచ్చి. స్నేహితులతో కలిసి ఐపిఎల్‌లో ప్రతి క్రికెట్ మ్యాచ్ తిలకించిన తర్వాత సెల్‌ఫోన్లో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లోకి ప్రవేశించి పందేలు కట్టడం ప్రారంభించడం జరుగుతుందని ఆరోపణలు వినవస్తూ ఉన్నాయి. ఆరంభంలో నగదు రావడంతో మరింత ఉత్సాహం చూపిస్తారు. తరువాత పందేల్లో రూ.వేల నగదు పోగొట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. తొలుత బంధువులు, తెలిసినవారి వద్ద అప్పులు చేయడం, నగదు కోసం ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకున్న తర్వాత బకాయిలు పెరిగిపోవడంతో చోరీలకు దిగి పోలీసులకు చిక్కిపోతూఉన్నారు. అరచేతిలో ఇమిడే సెల్‌ఫోన్‌తో సమస్త ప్రపంచాన్ని వీక్షించే అవకాశం వచ్చింది. తాము చదివే కోర్సులకు సంబంధించి సమాచారాన్ని సేకరించి, జ్ఞానాన్ని విస్తృతం చేసుకుంటున్నారు. కొందరు మాత్రం సామాజిక మాధ్యమలు, క్రికెట్ బెట్టింగులు, ఓటీటీల్లో సినిమాల వీక్షణతో కాలక్షేపం చేస్తూ జీవితాన్ని బలిచేసుకుంటున్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు సెల్‌ఫోన్‌లను ఎక్కువగా వాడతారు. తల్లిదండ్రులు కొనిఇస్తే అప్పటి నుంచి వానిని రోజూ రాత్రి ఫోన్లో ఓటీటీ ఫ్లాట్‌ఫాం,యాప్‌లలో వీడియోలు చూడటం ప్రారంభించడం,రాత్రి నిద్రపోకుండా తెల్లవారుజామున రెండు, మూడు గంటల వరకు సెల్‌ఫోన్ చూస్తూ గడిపేస్తున్నారు. రాత్రి నిద్రపోకపోవడం వల్ల ఉదయం తరగతి గదిలో మత్తుగా ఉండి అధ్యాపకులు చెప్పేపాఠాలు వారికి అర్థం కావడం లేదు.ఏకాగ్రత దెబ్బతిని చదువుపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు.అనారోగ్య సమస్యలు తలెత్తాయి. కరోనా లాక్‌డౌన్ కారణంగా ఇంట్లోనే ఉండాల్సి రావడం, ఖాళీ సమయం ఎక్కువగా లభించడంతో యువత ఓటీటీలు, యాప్‌లు చూడటానికి అలవాటుపడ్డారు. ఓటీటీలో కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌ల్లో అశ్లీల సన్నివేశాలు, సంభాషణలు నేరుగా ప్రసారమవుతున్నాయి. ప్రస్తుతం ఎలాంటి సెన్సార్‌షిప్ లేకపోవడంతో వీటిని చూసి పిల్లలు, యువత పాడైపోతున్నారని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హింసాత్మక, లైంగిక కార్యకలాపాల దృశ్యాలు నేరుగా ప్రసారం అవుతుండడంతో యువత తీవ్రంగా ప్రభావితమై చెడిపోతున్నారు. విద్యార్థులు ఏకాగ్రత దెబ్బతిని సరిగా చదువుపై



దృష్టిసారించలేకపోతున్నారు. తలనొప్పి, కంటిచూపు ఇతర అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. యాంత్రిక జీవనంలో సంస్కృతి, సంప్రదాయాలు మరిచిపోతున్నారు. నైతిక విలువలు, ప్రమాణాలు దిగజారిపోయి అడ్డదారులు తొక్కుతున్నారు. గంజాయి, మత్తుపదార్థాలు, మద్యం అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. జల్సాలకు అలవాటుపడి ఈ దందాలోకి దిగినట్లు పోలీసుల విచారణలో తేలుతుంది. ఎనిమిది నుంచి పది గంటలు స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లలో సినిమాలు, వీడియోలు చూడటం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. పిల్లలు, యువతలో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. తలనొప్పి, కంటిచూపు సమస్యలు వస్తున్నాయి. మానసిక కుంగుబాటుకు లోనవుతున్నారు. మత్తు పదార్థాల సేవనానికి అలవాటుపడి బానిసలై నగదు కోసం నేరాలకు దిగడం చాలా ఆందోళనకరం. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు వచ్చిన తర్వాత పోలీసులు నిఘాపెట్టి పట్టుకోవడం కష్టసాధ్యంగా మారింది. ఐపిఎల్ సమయంలో పెద్దఎత్తున బెట్టింగ్‌లలో యువత భారీఎత్తున నగదు పోగొట్టుకున్నారు. రూ.లక్షల అప్పు చేసి తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతూ తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని మిగుల్చుతున్నారు. సెల్‌ఫోన్‌ను సద్వినియోగం చేసుకుంటే ఎన్నో కొత్తవిషయాలు తెలుసుకోవచ్చు. విద్యార్థులు, యువత పలురకాల ఆటలు ఆడేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని నిపుణులు సూచిస్తున్నారు. వారికి ఇష్టమైన కళలో శిక్షణ ఇప్పిస్తే రాణిస్తారు. యోగ, ధ్యానం, సాధన చేయించడం ద్వారా ఏకాగ్రత సాధిస్తారు. పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి పెట్టి తర్వాత దారితప్పక ముందే వారు సన్మార్గంలో నడిచేలా చూడాలి. తల్లిదండ్రులు ఎంత తీరిక లేకుండా ఉన్నా పిల్లలకు మాత్రం తగిన సమయం కేటాయించాలి. వారితో ప్రేమగా మాట్లాడి ఇష్టాయిష్టాలు తెలుసుకోవాలి. మంచి, చెడు గురించి వివరంగా చెప్పాలి. సానుకూల దృక్పథంలో ఆలోచించేలా ఉండాలి. విద్యార్థులు, యువత బలహీనతలను ఆసరాగా తీసుకొని బెట్టింగ్ తరహా వ్యాపారాలు కొంత మంది చేస్తున్నారని సామాజికవేత్తల అభిప్రాయం వెలిబుచ్చుతూ ఉన్నారు. తొమ్మిది గంటల కల్లా పిల్లలని నిద్రపుచ్చి తెల్లవారుజామున ఐదు గంటలకే నిద్రలేపి ధ్యానం, యోగా సాధన చేయించాలి. యువత సెల్‌ఫోన్‌కి దూరంగా ఉండి మితంగా వాడాలి. అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండాలి. ●

# ఇక భాగ్యసీమగా భారతదేశం!



వుప్పల నరసింహం
సీనియర్ జర్నలిస్టు

భారతదేశమిప్పుడు భాగ్యసీమగా మారుతోంది. నైపుణ్యం, ఆధునిక సాంకేతిక మూలస్తంభాలుగా దేశ శీఘ్రగతిన అభివృద్ధి చెందుతోంది. పిఎం గతిశక్తి విధానం ఇందుకు ఉపకరిస్తోంది. పరిణితి చెందిన నాయకత్వం దిశానిర్దేశం మరింత ఉత్సాహాన్ని ఇస్తోంది. సమాజంలోని చివరి వ్యక్తికి సైతం సంక్షేమ ఫలాలు అందేందుకు మార్గం మరింత సుగమం అవుతోంది. ఇది అద్భుతమంటే అతిశయోక్తి అవదు. ప్రపంచంలో ఎక్కడాలేనంతగా భారతదేశంలో సృజన శక్తిగల యువత ఉంది. ఇదోవరం. బంగారు భవిష్యత్‌కు సోపానం. సాంకేతికత, నైపుణ్యాలను ఒడిసిపట్టడానికి ఈ యువతే కీలకం. ఆ శక్తి గతిశక్తిగా రూపాంతరం చెందుతూ ఉండడంతో దేశ భాగ్యసీమగా పరిఢవిల్లుతోంది. ఇందుకు సంబంధించిన అన్ని శుభశకునములు ఇప్పుడు ఇబ్బడిముబ్బడిగా కనిపిస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ జియో స్పెషియల్ ఇన్ఫర్మేషన్ సదస్సులో వాటి ఛాయలు కొన్ని దర్శనమిచ్చాయి. ఈ ప్రతిష్టాత్మక నాలుగు రోజుల సదస్సును ప్రధాని నరేంద్రమోడీ వర్చువల్‌గా ప్రారంభిస్తూ ప్రపంచ స్టార్టప్ హబ్‌లలో భారత యువతనే అగ్రస్థానంలో ఉందనీ, ఆవిష్కరణల్లోనూ ముందువరుసలో నిలిచామని పేర్కొన్నారు. సాధికారత, స్వావలంబన అన్న మాటలు ఇప్పుడు ఉత్ప్రేరకంగా పనిచేస్తున్నాయి. యువత తమ స్వప్న సాకారం కోసం సమస్త శక్తుల్ని ఒడ్డుతున్నారు. అందులో ఈ జియో స్పెషియల్ డేటా కీలక భూమిక వహిస్తోంది. అభివృద్ధికిది ఇరుసుగా ఉపకరిస్తోందని ప్రధాని అభిప్రాయపడ్డారు. నూతన సాంకేతికత సమాచారం సమాజ పరివర్తనకు అత్యంత కీలకమేగాక అదొక 'టూల్'గా సాధనంగా ఉపయోగపడుతోందని కూడా అని ప్రధాని చెప్పారు. కీలక రంగాలైన ఇస్రో, సర్వే ఆఫ్ ఇండియా, ఎన్ఐసి లాంటి జాతీయ సంస్థలు జియో ఇన్ఫర్మేషన్ ఆధారంగా అనేక ప్రాజెక్టులు ప్రారంభించాయి. గ్రామీణ అభివృద్ధి రోడ్లు, పంచాయతీల మ్యాపింగ్ సమర్థవంతంగా కొనసాగుతోంది. ఇదంతా గ్రామ సీమల్ని భాగ్యసీమలుగా తీర్చిదిద్దడానికి దోహద పడుతోంది. ఇటీవల ప్రారంభమైన 5-జి సాంకేతికత ఆధారంగా అనేక కొత్త అవకాశాలు ఉబికి వస్తున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల అంతరిక్ష సాగర సంపద పరిశోధనల్లోనూ వేగం పెరుగుతోంది. ఈ రంగాలలో ఇప్పుడు ప్రైవేట్ సంస్థలు ప్రవేశించడంతో అవకాశాలు విస్తృతమవుతున్నాయి. ఇందుకు 'డేటాబేస్' ఊపిరిగా నిలుస్తోంది. భారత్‌ను భాగ్యసీమగా మార్చడంలో



భాగంగా దేశంలో 'వందే భారత్' రైళ్లు ప్రారంభమయ్యాయి. గతవారం ప్రధాని హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనా రైల్వేస్టేషన్ నుంచి నాల్గవ వందే భారత్ రైలును ప్రారంభించారు. ఇది ఉనా 'హిమాచల ప్రదేశ్' నుంచి చండీగఢ్ మీదుగా ఢిల్లీకి చేరుకుంటుంది. అత్యాధునిక టెక్నాలజీ ఆధారంగా వేగంగా నడిచే ఈ రైళ్లు కొత్త తరానికి ప్రతీకగా కనిపిస్తున్నాయి. వచ్చే యేడాది స్వాతంత్ర్య దినోత్సవం నాటికి దేశంలో 75 వందేభారత్ రైళ్లను నడిపేందుకు రైల్వేలు ప్రణాళికను సిద్ధం చేసింది. రానున్న ఐదేళ్లలో మొత్తం 400 వందే రైళ్లు దేశం నలుమూలలా తిరగనున్నాయి. గత నెలలో గుజరాత్‌లోని గాంధీనగర్ నుంచి ముంబైకి వచ్చే రైలును ప్రధాని ప్రారంభించిన విషయం విదితమే. భారతమాల, సాగరమాల ద్వారా ఇప్పటికీ రోడ్లు- జలమార్గాల ప్రయాణం రవాణాలో విప్లవాత్మక మార్పు కనిపిస్తోంది. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సందర్భంలో ఆత్మనిర్భర్ భారత్‌లో అంతర్భాగంగా భారత ప్రజలకు ప్రణమిల్లే ఈ వందే భారత్ ప్రాజెక్టు కొత్త చరిత్రను సృష్టిస్తోంది. వీటిని సెమిస్పీడ్ రైళ్లుగా తీర్చిదిద్దారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి. దక్షిణాదిన శ్రీ పెరంబదూర్‌లో ఉత్తరాదిన లక్నో తదితర ప్రాంతాల్లో వేలాది మందికి దీనివల్ల ఉపాధి లభిస్తోంది. అభివృద్ధికి ఊతం అందుతోంది. విస్తృత అవకాశాలకు మార్గం ఏర్పడుతోంది. ప్రైవేట్ రంగంలో పెట్టుబడుల వరద ఇటు తెలంగాణలో, అటు గుజరాత్, రాజస్థాన్‌లో కొనసాగుతోంది. ఆయా పరిశ్రమలు ఆధునిక సాంకేతికత-నైపుణ్యం కేంద్రంగా ఆవిర్భవిస్తూ ఉండటం విశేషం. హైదరాబాద్‌లోని ఔషధ జీవరసాయనాల కంపెనీల రాక, ఫార్మ్యానూనె శుద్ధి కర్మాగారంగాని, జినోమ్ వ్యాలీలో జంతువుల కోసం టీకా తయారీ ఇతర రంగాల్లో పెట్టుబడి అంతా ఓ అద్భుత ప్రపంచపు ఆనవాళ్లుగా కనిపిస్తున్నాయి. ఐటి, సేవల రంగంలో స్టార్టప్స్‌లలో అనూహ్యమైన, ఎమర్జింగ్ టెక్నాలజీలతో కొత్త-సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ఈ జీవనాడిని పట్టుకోవడంలో ఎవరు విఫలమైనా వారు వెనుకబడటం ఖాయం. భారత్‌లో ఐఫోన్ తయారీకి టాటాలు ముందుకు రావడం విప్లవాత్మక పరిణామం. ఇంధన, సౌర విద్యుత్, పవన విద్యుత్, హరిత హైడ్రోజన్ తయారీకి నూతన టెక్నాలజీ దోహదపడుతోంది. దీనికి సంబంధించి ముఖ పారిశ్రామిక-వాణిజ్యవేత్త అదానీ రాజస్థాన్‌లో రూ.8 లక్షల కోట్ల పెట్టుబడితో 10వేల హెక్టార్లలో ఓ అత్యద్భుత ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు ఇటీవల ప్రకటించారు. పునరుత్పాదక విద్యుత్, హైబ్రిడ్ ఇంధనం తయారీ శకం ప్రారంభం కాబోతోంది.ఇది పూర్తిగా పర్యావరణహితం కావడం గమనార్హం. వీటిని చౌకగా ఉత్పత్తి చేయడమంటే ప్రజలకు, వినియోగదారులకు ఎంతో ప్రయోజనం. మేలు ఒనగూరనున్నదన్నమాట. చైనాను వెనక్కినెట్టేసి భారత్ వృద్ధి గాథ ఘనంగా ముందుకెళ్లుతోంది. మాంద్యం కొంత కనిపించినా అమెరికా,చైనా కన్నా భారత్ వృద్ధి రేటు ఇప్పుడు చాలా ఎక్కువ అన్న విషయం విస్మరించరానిది. అందుకే భారత్ భాగ్యసీమ బంగారుసీమ అని అంటున్నది. ●

ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

## రైతు పేరుతో రాక్షస క్రీడ జరుగుతుంది- బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన.

సీతానగరం అక్టోబర్ 17 ప్రభాతవార్త : రాష్ట్రంలో రైతుల పేరుతో రాక్షస క్రీడ జరుగుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. సోమవారం మండలంలో రఘుదేవపురం పంచాయతీ పరిధిలో పలు భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు జక్కంపూడి రాజాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రైతుయాత్ర పేరుతో రాక్షస క్రీడ జరుగుతున్నదని తెలుగుదేశం, జనసేన పార్టీలు రైతు అంటే వేరేభావం కలిగించేలా ప్రవర్తిస్తూన్నాయని రియల్ ఎస్టేట్ పేరుతో భూములు ఇచ్చి రైతుల వేశాల్లో తామే అభివృద్ధి చెందాలి అని ఒక యాత్ర సాగుతోన్నదని ఈ యాత్ర పట్ల ప్రజాలందరిలోనూ చర్చ జరగాలని వారి బాగుకోసం మనమందరం బలి అవుదామ లేక అందరి బాగుకోసం జగనన్న చేస్తూన్న యజ్ఞానికి మద్దతా అనేది ఆలోచించాలని అన్నారు. లేనిది ఉన్నట్లు చూపించాలని తాపత్రయంతో పరిపాలనను పక్కదోవ పట్టెలా అసత్యాలను ప్రచారంచేయలనే ప్రయత్నాలు చేస్తూన్నారని అన్నారు. రాష్ట్రంలో అన్నిప్రాంతాలకు అభివృద్ధి అందించే నిర్ణయానికి అందరూ మద్దతు ఇవ్వాలని అన్నారు. అలాగే సచివాలయాలు అంటే గ్రామాల అవసరాలు తీర్చే వ్యవస్థ అని ఆ వ్యవస్థను ప్రజల కు అడుగు దూరంలో తీసుకొచ్చి 700ల సేవలు అందించేందుకు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తీర్చిదిద్దడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వాలు రైతుల పట్ల మొసలి కన్నీరు కార్చడం తప్ప చేసిందేమీ లేదని కానీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి



వచ్చాక 2019కోట్లు వెచ్చించి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తూన్నారని అన్నారు. సంక్షేమ పథకాలు అందించడం లబ్దిదారులకు నేరుగా వారి ఖాతాలకు నగదు బదిలీ చేయడం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. స్థానిక శాసన సభ్యులు జక్కంపూడి రాజా ముందుచూపున్న వ్యక్తని అతను భవనాల నిర్మాణంలో రాష్ట్రంలో మొదటిగా ఉంటారని అతనిని అభినందనలు అని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఒక గొప్ప విప్లవం అని పేదలకు మరింత మెరుగైన సేవలు అందించనున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఎంపీపీ జ్యోస్న, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల, గద్దె వెంకటకృష్ణ చౌదరి, గెద్దాడ త్రిమూర్తులు అధికారులు పాల్గొన్నారు.

## గ్రామ సచివాలయ నిధులతో చేపట్టే పనులకు పంచాయతీ తీర్మానం అవసరం లేదు..

అంబాజీపేట,అక్టోబర్ 17, ప్రభాతవార్త :మండలంలోని కె పెదపూడి పంచాయతీ పరిధిలోని శ్రీ కృష్ణా రాయుడు,శ్రీ మేనకేశ్వర స్వామి వార్లకాలనీల్లో ఉన్న రహదారులను దశలవారీగా నిర్మాణాలు పూర్తి చేస్తామని జిల్లా పంచాయతీ అధికారిణి కె.కృష్ణ కుమారి చెప్పారు. కె. పెదపూడిలో శ్రీ కృష్ణరాయుడు, శ్రీమేనకేశ్వర స్వామి వార్ల కాలనీలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ కృష్ణకుమారి మాట్లాడుతూ గత నెల 29న జరిగిన గడపగడపకుబిమన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కాలనీలకు వచ్చిన ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు కాలనీలవాసులు రహదారులు నిర్మించాలని విన్నవించుకున్నారన్నారు. కాలనీల్లో ఉన్న సమస్యలను గుర్తించిన ఎమ్మెల్యే చిట్టిబాబు గ్రామ సచివాలయ ప్రత్యేక నిధులతో రోడ్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారన్నారు. అయితే ఈ రెండు కాలనీలలో రహదారుల నిర్మించేందుకు గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఎలా పనులు చేపడతారని, పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అధికారిలు ఏకపక్ష నిర్ణయంతో పనులు చేపట్టేందుకు సమాయుత్తం అవుతున్నారని పంచాయతీ సర్పంచ్ బీర శాంతి గత వారం జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కాలనీలలో రోడ్లుకు నిర్మించేందుకు ఎమ్మెల్యే చొరవతో గ్రామ సచివాలయ నిధులు కేటాయిస్తే,వాటిని సర్పంచ్ అడ్డుకుంటున్నారనే అపోహపడిన కాలనీ వాసులు సోమవారం జరిగిన స్పందనలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. దీంతో



డీపీఓ క్షేత్ర స్థాయిలో పర్యటించి స్థానికులతో చర్చించారు. శ్రీకృష్ణరాయుడు కాలనిలో 2, శ్రీమేనకేశ్వర స్వామి కాలనీలో 4 రహదారులను రూ.15 లక్షలతో నిర్మించనున్నామన్నారు. సచివాలయ నిధులతో చేపట్టే పనులకు స్థానిక పంచాయతీ తీర్మాణం అవసరంలేదని, త్వరలో రోడ్లు నిర్మిస్తామని డీపీఓ కృష్ణకుమారి స్థానికులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీర శాంతి, ఈఓపీఆర్డీ బి.మమత,పంచాయతీ కార్యదర్శి ఆర్.వై.చంటి,ఆర్డబ్ల్యూఎస్ జే.ఈ. ఆర్. చలమయ్య , వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖాదర్ మోహియుద్దీన్, అనిల్ డ్యానీ లకు శిఖామణి సాహితీ పురస్కారాలు

యానం అక్టోబర్17, ప్రభాతవార్త: యానం నియోజకవర్గం యానాం కవిసంధ్య సంస్థ తరపున,సాహిత్యం లో జీవన సాఫల్య కృషికి ప్రతీ ఏటా ఇచ్చే శిఖామణి సాహిత్య పురస్కారం(10,000) 2022కి సుప్రసిద్ధ కవి, అనువాదకులు, సీనియర్ పాత్రికేయులు ఖాదర్ మోహియుద్దీన్ , శిఖామణి యువ కవితా పురస్కారం(5,000 )వర్ధమాన కవి అనిల్ డ్యాని ఎంపిక అయినట్టు పురస్కార కమిటీ ప్రకటించినట్టు కవిసంధ్య ఉపాధ్యక్షుడు దాట్ల దేవదానం రాజు తెలిపారు. పురస్కారకమిటీ సభ్యులుగా నగ్నముని, శివారెడ్డి, శిఖామణి వ్యవహరించినట్లు పురస్కార కమిటీ అధ్యక్షులు దాట్ల దేవదానం రాజు ఒకప్రకటన లో తెలియ చేశారు. వీటితో పాటు ప్రతి ఏటా ఇచ్చే కవి సంధ్య ప్రతిభా పురస్కారాలు (1,116) వివిధ రంగాలలో కృషి చేసిన సర్వ శ్రీ కొండ్రెడ్డివెంకటేశ్వర రెడ్డి ,మల్లవరపు వెంకట రావు,పుచ్చకాయల బ్రహ్మాజీ రావు, వాడ్రేవు సుందర రావు, అరసవిల్లి గిరిధర్, కొల్లూరి, ప్రసేన్, నేలపూరి రత్నాజీ,మందరపు హైమ వతి, కోసూరి రవి కుమార్ లకు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా శిఖామణి సమగ్ర సాహిత్యం, సాహిత్య వ్యాసాలు 5,6 సంపుటులు, కవి సంధ్య -39, కుందుర్తి శత జయంతి సంచికఆవిష్కరణలు ఉంటాయి.పురస్కారాల సభ అక్టోబర్ 30 సాయంత్రం 5.30 కి విజయవాడ బాలోత్సవ్ భవన్ లో జరుగుతుంది. దాట్ల దేవదానం రాజు అధ్యక్షతన జరిగే ఈ సభలో మండలి బుద్ద ప్రసాద్, దీర్ఘాశి విజయ్ భాస్కర్, అప్పాజోస్యులసత్యనారాయణ, జి. లక్ష్మీ నరసయ్య, ప్రసాద మూర్తి, సీతారాం, చల్లపల్లి స్వరూప రాణి,భూసురపల్లి వెంకటేశ్వర్లు,ఈమని శివనాగి రెడ్డి, ముప్వా శ్రీనివాస రావు,అరసవిల్లి కృష్ణ,పుప్పాల శ్రీ రాం, గూటం స్వామి, శిఖా ఆకాష్ తదితరులు పాల్గొంటారని దేవదానం రాజు తెలిపారు.

## పిఎం కిసాన్ సమృద్ధి యోజనా కేంద్రం ప్రారంభం

అమలాపురం, అక్టోబరు17,ప్రభాతవార్త : డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలో ఈ కేంద్రాన్ని స్థానిక గొల్లగూడెం బైపాస్ రోడ్ లోగల రామలక్ష్మి ఏజెన్సీస్ నందు ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కల్వకొలను తాతాజీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామలక్ష్మి ఏజెన్సీ అధినేత యె%శీ%దూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రంగా మా యొక్క షాపు ను ఎంపిక చేయడం చాలా సంతోషమని రైతులకు వన్ స్టాప్ షాప్ గా పనిచేయాలనే సంకల్పించి ఎరువులు విత్తనాలు పురుగుమందులు వంటి నాణ్యమైన అగ్రీ ఇన్పుట్ లను సరసమైన ధరలకు ఒకేచోట అందించాలనే సంకల్పంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ విధానాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఏలూరులో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారని రానున్న రోజుల్లో మండలం ,గ్రామ స్థాయిలో ఒక్కొక్కటిగా ఇలాంటి షాప్ ను ప్రారంభిస్తారన్నారు. రానున్న రోజుల్లో ల్యాండ్ సోయిల్ టెస్ట్, వాటర్ టెస్ట్ వంటి వాటిని ఈ కేంద్రంలోని చేయబడుతుందని శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సమావేశాలు ఏర్పాటు చేసి తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుందని నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ రవితేజ, డెవలప్మెంట్ ఆఫీసర్ దుర్గా సాయి, యె%శీ%దూరి పండు, రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం జనసేన పార్టీపై కక్షసాధింపు చర్యలు విడనాడాలి: మాలే నగేష్



సఖినేటిపల్లి అక్టోబర్ 17, ప్రభాత వార్త : రాష్ట్ర ప్రభుత్వం జనసేన పార్టీపై కక్ష సాధింపు చర్యలను విడనాడాలని రాష్ట్ర బిజెపి కో-ఆపరేటివ్ సెల్ డైరెక్టర్ మాలే శ్రీనివాస నగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అడబాల సత్యనారాయణ, మండలాధ్యక్షులు శివరామకృష్ణరాజు లు వైసిపి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కి పోలీసులు ఆంక్షలు విధించడం, జనసేన పార్టీ నాయకులను అక్రమ అరెస్టులు చేయడం పై తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాల్ని అనుసరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికేనా పవన్ కళ్యాణ్ పై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును జాతీయ, రాష్ట్ర బిజెపి పార్టీలు ఖండించిందని జనసేన పార్టీకి బిజెపి అండగా ఉంటుందని తెలిపారు.

## టీడీపీ నాయకులను అడ్డుకున్న పోలీసులు

### - అమరావతి రైతులకు స్వాగతం పలికేందుకు వెళ్తున్న టిడిపి శ్రేణులు.
### - టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సహా పలువురు నేతల అరెస్టు

రావులపాలెం, అక్టోబర్ 17, (ప్రభాతవార్త) : అమరావతి రైతుల పాదయాత్ర తూర్పుగోదావరి జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం చేరుకుంటున్న సందర్భంగా వారికి స్వాగతం పలికేందుకు వెళ్తున్న టీడీపీ నాయకులను డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో పోలీసులు అడ్డుకున్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నుంచి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు రాజమహేంద్రవరం బయలుదేరగా పార్టీ కార్యాలయం వద్ద సిఐ రజనీ కుమార్, సిబ్బందితో కలిసి వారి వాహనాలను అడ్డుకున్నారు. దీంతో టీడీపీ నాయకులు పాదయాత్రగా జాతీయ రహదారిపైకి చేరుకున్నారు. ఈ సమయంలో మరోసారి పోలీసులు వారిని అడ్డుకోవడంతో నాయకులు పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తోపులాట చోటుచేసుకుంది. టీడీపీ నాయకులు రోడ్డుపై బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. దీంతో వారిని అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా బండారు



మాట్లాడుతూ ప్రజా సంకల్పాన్ని అధికారంతో అడ్డుకోవాలని చూస్తే సహించేదిలేదన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని పోలీసులతో ప్రతి పక్షాలను అడ్డుకుంటున్న వైసీపీ నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు, మేడపాటి కాసురెడ్డి, కంఠంశెట్టి శ్రీనివాసరావు, పడాల బులి కొండారెడ్డి, ధరణాల రామకృష్ణ, బూసి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీచు బొమ్మల తయారీలో శిక్షణ

మామిడికుదురు.అక్టోబర్17 ప్రభాతవార్త : మామిడికుదురు మండలం లోని అప్పనపల్లి గ్రామం లో నాబార్డ్ సహకార తో ఎంఇడిపి పీచు బొమ్మల తయారీ శిక్షణను ఆక్సిజన్ అసోసియేషన్ గత కొన్ని రోజులుగా నిర్వహిస్తుంది.దీనిలో భాగంగా అనంతపురం జిల్లా మూస ఫైబ్రల్ అధినేత పుల్లగూర శ్రీనివాస్ మాట్లాడుతూ 15 రోజుల శిక్షణ కార్యక్రమం మహిళలకు బాగా ఉపయోగపడుతుందని తెలియజేస్తూ, మూస ఫైబ్రల్ సంస్థకు ఇతర దేశాల్లో సంబంధాలు ఉన్నాయన్నారు. తైవాన్, సింగపూర్ దేశంలో సంస్థ ద్వారా మార్కెట్ చేస్తున్నామని, అలాగే మన ఇండియాలో కూడా కొన్ని కొన్ని ప్రదేశాల్లో సంస్థ కొందరితో ఒప్పందం చేసుకుందన్నారు.సంస్థ ఆక్సిజన్ అసోసియేషన్ తో కలసి మహిళలు తయారు చేసినటువంటి కాయిర్ బొమ్మలను మేము మూస ఫైబ్రల్ సంస్థ ద్వారా మార్కెట్ చేసే రకంగా ఒప్పందం చేసుకుంటా మన్నారు. త్వరలో జరిగే ఈ ఒప్పందం గ్రామీణ మహిళకు ఆర్థిక స్వావలంబన ఇస్తుందని ఆక్సిజన్



అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం అన్నారు.ఈ కార్యక్రమంలో ట్రెనర్ శెట్టెం రమేష్ , కుంపట్ల విజయదుర్గ , కంకిపాటి రాణి, పద్మ, భారతి దుర్గ, పుష్పావతి, శిక్షణ పొందే సభ్యులు, డ్వాక్రా గ్రూప్ మహిళలు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగి సుభాష్ చంద్రవర్మకు నివాళి..

అంబాజీపేట, అక్టోబర్ 17, ప్రభాతవార్త : రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామ సచివాలయంబి2 లో ఉద్యాన శాఖ సహాయకుడు ( వీహెచ్ఎ)గా విధులు నిర్వహిస్తూ ఆత్మహత్యకు పాల్పడిన డి.సుభాష్ చంద్రవర్మ ఆత్మకు శాంతి చేకూరాలని అంబాజీపేట మండల సచివాలయ ఉద్యోగులు సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సుభాష్ చంద్రవర్మ ఆకస్మిక మృతికి చింతిస్తూ రెండు నిమషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుడి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల వత్తిడిలు తమపై తీవ్ర వ్యతిరేక ప్రభావం చూపిస్తున్నాయని, టార్గెట్లు పూర్తి చేయాలంటూ వేళా, పాలా లేకుండా వేధిస్తున్నారన్నారు. ఉన్నతాధికారుల వేధింపుల వల్లే మనోవేదన చెందిన సుభాష్ చంద్ర వర్మ బలవన్మరణానికి పాల్పడ్డాడని ఆరోపించారు. సచివాలయ ఉద్యోగులు పని దినాలలో సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు.



ఉద్యోగ నిర్వహణలో వచ్చే అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు మండలానికి ఒక అధికారిని నియమించాలని కోరారు.ప్రతీ సచివాలయ ఉద్యోగులకు “ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్” కల్పించాలని, ఉద్యోగి కుటుంబ సభ్యులకు రైస్ కార్డులు మంజూరు చేయాలని, మహిళా ఉద్యోగుల రక్షణ కల్పించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ ఐ.రత్నంరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రాజవరం వివో ఏ పై స్పందనలో ఫిర్యాదు

రౌతులపూడి, అక్టోబర్ 17 ( ప్రభాతవార్త ): మండలంలోని రాజవరం గ్రామఖ్య సంఘ అకౌంటెంట్ అవకతవకలపై ఆర్. వెంకటనగరముకు సియాదుల ద్రౌపది జిల్లా స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశారు. ఉన్నతి ద్వారా 50వేల రూపాయలు రుణం మంజూరు అయిందని, లోను డబ్బులు తీసుకున్నప్పుడు ఎటువంటి రసీదు ఇవ్వకుండా రెండు నెలలకు ముందుగానే వివో ఏ రికవరీ సొమ్ము తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చెల్లించిన డబ్బులకు రసీదు అడుగుతుంటే ఆడిట్ వచ్చేవరకు రికార్డులో జమ చేయడం జరగదని దుర్భసలాడినట్లు ఆమె తెలిపారు. అంతేకాకుండా వివో ఏ మాట్లాడిన సంభాషణ ఆడియోను విలేకరులకు అందజేశారు. మహిళా సంఘ సభ్యులకు గౌరవం ఇవ్వని వివో ఏ పై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## నవీన్ పాదయాత్రకు విశేషం స్పందన

గండేపల్లి అక్టోబర్ 17,(ప్రభాతవార్త): గండేపల్లి మండలంలో అడుగు అడుగున జననీరాజనాలతో మహిళల మంగళహారతులతో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కోర్పు సాయి తేజ ఇంటి వద్ద ప్రారంభమైన జ్యోతుల నవీన్ మూడవ రోజు పాదయాత్ర , సింగరంపాలెం, కే గోపాలపురం, ఎన్టీ రాజాపురం గ్రామాలలో సాగింది . వంగవీటి రాధా, పరిటాల శ్రీరామ్,జిఎంసి హరీష్ బాలయోగి, ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, పేరాబత్తుల రాజశేఖర్ లు నవీన్ పాదయాత్ర కు సంఘీభావం తెలిపారు. ఎన్.టి రాజాపురంలో రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ పేద ప్రజలకు భారంగా పెంచిన నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని భారీగా పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలన వైఫల్యాలను ఎత్తుచూపుతూ నియోజవర్గం లోని ప్రజల కష్టాలు తెలుసుకునేందు జగ్గంపేట నియోజకవర్గం పాదయాత్ర చేస్తున్నానని అందులో భాగంగా గండేపల్లి మండలం లో మూడవ రోజు పాదయాత్ర చేయడం జరుగుతుందన్నారు. రైతులకు డ్రిప్ సబ్సిడీ పునరుద్ధరించాలని



వ్యవసాయ ఆధునికరణ యంత్రాలపై సబ్సిడీ కొనసాగించాలని చంద్రన్న బీమా కొనసాగించాలని అన్నా క్యాంటీన్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర, పోతుల మోహనరావు, కోర్పు సాయి తేజ, అవసరాల బాలసుబ్రమణ్యం, అక్కిన నాగేశ్వరరావు, అక్కిన సుదర్శన రావు, బోళ్ల సతీష్, కర్రీ శ్రీను, పాతాళ గనిరాజు, కంటిపూడి సత్తిబాబు, కానుకొనల శ్రీను, బొల్లిన వాసు, ఆకుల రాజు, కానుకొనల వాసు కే. గోపాలపురం ఎన్.టి.రాజాపురం గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంభానికి రూ.10 వేలు రూపాయలు అందజేత

వి ఆర్ పురం, అక్టోబర్ 17, ప్రభాతవార్త : మండలంలోని రేకపల్లి గ్రామ పంచాయతీ పరిదిలోగల ఉమ్మడివరం రెడ్డి గుంపు గ్రామలో ఇటివల అనారోగ్యంతో మరణించిన కారం లక్ష్మణరావు కుగాను, ప్రభుత్వం నుండి దహన సంస్కారాల కోసం మంజూరైన రూ. 10. వేల రూపాయలను మృతుని భార్య వెంకమ్మకు సోమవారం స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, సిపిఎం మండల కమిటి సభ్యులు చిక్కాల రామారావు, తదితరులు, బాదిత కుటుంభ సభ్యులు పాల్గోన్నారు.



# రైతులేనిదే రాజ్యం లేదు..

ప్రభాతవార్త-ఏలూరు : దేశ వ్యాప్తంగా 2 లక్షల 70 వేల ఎరువుల దుకాణాలు ఉన్నాయని వీటన్నింటిని రానున్న రోజుల్లో ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా రైతులకు అందుబాటులో ఉంచుతామని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మరియు ఈశాన్యరాష్ట్రాల అభివృద్ధి శాఖా మంత్రి జి. కిషన్ రెడ్డి చెప్పారు. సోమవారం స్థానిక గన్ బజారులో ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలను మండలాలు ముఖ్యమైన గ్రామాల్లో ప్రారంభించడం జరుగుతుందన్నారు. వాటిలో బ్యాంకు బ్రాంచిలు ఏర్పాటు చేసి రైతులకు పంట రుణాల ప్రోసెసింగ్ కూడా ఇక్కడ నుండే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఏలూరులో ప్రారంభించిన ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఉన్న వ్యవసాయ ఉత్పత్తులు భూసార పరీక్షల సౌకర్యాలు, ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ సబ్సిడీలు, ఎంఆర్పిల రేట్లతో ఉన్న బోర్డులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఏలూరు శాసన సభ్యులు ఆళ్ల నాని, జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, మాజీ శాసన మండలి సభ్యులు, బిజేపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు,



ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధనరెడ్డి, ఆర్డిఓ కె. పెంచల కిషోర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై. రామకృష్ణ, తహశీల్దారు సోమశేఖర్, కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కు చెందిన సుబ్బారెడ్డి, కె. సత్యనారాయణ, ఖాళిదాస్, ప్రమాణిక్, శ్రీ రామాంజనేయ మెన్యూర్స్ కంపెనీ జయ ప్రకాష్, బిజేపి నాయకులు అంబికా కృష్ణ, పాకా సత్యనారాయణ, మాలతీరాణి, భూపతిరాజు శ్రీనివాసువర్మ, నిర్మల కిషోర్, లక్ష్మీపతిరాజ, దేవి తదితరులు పాల్గొన్నారు.

# చదువే ముద్దు-బాల్యవివాహాలు వద్దు

పెనుమంట్ర, అక్టోబర్-17, ప్రభాతవార్త: మండల కేంద్రం పెనుమంట్ర పెద్ద చెరువు గట్టు అంగన్వాడీ కేంద్రం కేంద్రంలో సోమవారం చదువే ముద్దు-బాల్యవివాహాలు వద్దు, చిన్నప్పుడే పెళ్లి- వారి జీవితానికి విషాదం అనే నినాదంతో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 2006 బాల్య వివాహాల నిషేధ చట్టం ప్రకారం 18 సంవత్సరములు లోపు, ఆడపిల్లలకు, 21 సంవత్సరంలోపు మగ మగ పిల్లలకు వివాహం చేయటం చట్టరీత్యా నేరమని వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మంగాయమ్మ, వార్డు సభ్యులు దానయ్య, తల్లులు మరియు కిశోర బాలికలు పాల్గొన్నారు.



# టి ఏ ఆర్ ఎల్ పై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమము




కొయ్యలగూడెం, అక్టోబర్ 17, ప్రభాతవార్త: మండల కేంద్రం కొయ్యలగూడెం బాలుర ఉన్నత పాఠశాల నందు మూడు నాలుగు ఐదు తరగతులు బోధించు ఉపాధ్యాయులకు టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ పై తెలుగు మరియు గణితంపై సోమవారం నుండి నాలుగు రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి సురేష్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణ .కార్యక్రమంలో అంశాలను అవగాహన చేసుకుని తమ తమ తరగతి గదిలో అమలు చేయాలని సూచించారు. తెలుగు గణితం నందు బేస్ లైన్ టెస్ట్ నిర్వహణ, విద్యార్థుల స్థాయిని బట్టి సమూహాలుగా నిర్ధారించటం గురించి అవగాహన చేసుకుని పాఠశాల నందు అమలు చేయాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో భాగంగా .తెలుగు సబ్జెక్టు అమలు తరగతి గది నిర్వహణ, కథ, సంభాషణ, ధ్వని, ఉచ్చరణ, మైండ్ మ్యాపింగ్ తదితర అంశాలను రిసోర్స్ పర్సన్లు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్లుగా కే వి వి ఎస్ ఎన్ ప్రసాద్, కే వరప్రసాద్, ఆర్ వి రమణ, సి ఆర్ పి ధనలక్ష్మి లు వ్యవహరించారు.

# పరింపూడిలో గడపగడపకు మన ప్రభుత్వం

కొయ్యలగూడెం, అక్టోబర్ 17, ప్రభాతవార్త: మండల కేంద్రం కొయ్యలగూడెం పరింపూడి సచివాలయం పరిధిలో సోమవారం పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి నవరత్నాల గురించి వివరించారు. అదేవిధంగా నవరత్నాలు ప్రజలకు ఎలా అందుతున్నాయో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతే కాకుండా తన దృష్టికి వచ్చిన అనేక ప్రజా సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేశారు. అనంతరం స్థానిక మార్కెట్ యార్డులో రెండో విడత వైయస్సార్ రైతు భరోసా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పథకం ద్వారా నియోజకవర్గంలో ఏడు మండలాలకు చెందిన .సుమారు 40,000 మంది రైతుల ఖాతాల్లోకి రూ 2000 చొప్పున రూ. 10 కోట్ల 30 లక్షల రూపాయలు నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా ప్రజా ప్రతినిధులు ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు అభిమానులు పాల్గొన్నారు.



# టి ఆర్ ఏ ఎల్ శిక్షణ తరగతులు ప్రారంభం



లింగపాలెం ప్రభాతవార్త అక్టోబర్ 17..... ప్రైమరీ పాఠశాలల్లో మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు చదవడం రాయడం వచ్చి ఉండాలని మండల విద్యాశాఖ అధికారి కె రామారావు ఉపాధ్యాయులకు సూచించారు . సింగాగూడెం హైస్కూల్లో మొదటి విడత తరల్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు .ఈ సందర్భంగా ఎంఈఓ రామారావు మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమం రెండు విడతలుగా ఉంటుందని మొదటి విడత ప్రారంభించడం జరిగిందని జిల్లా స్థాయిలో పొందిన రిసోర్స్ పర్సన్ లు నలుగురు మండల స్థాయి ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మొదటి విడతగా ఈనెల 17వ తేదీ నుండి 20వ తేదీ వరకు ,రెండవ విడతగా 26వ తేదీ నుండి 29వ తేదీ వరకు ఈ శిక్షణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రథమ్ అనే సమస్త మరియు ఎస్ ఎస్ ఏ వారి ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లుగా ఎస్. నాగేశ్వరరావు, ఎన్. తిరుపతి, కే .బెంజిమెన్, జి. కుమార్ మంగళం పాఠశాల హెచ్ఎం టి.ప్రభాకర్రావు, సిఆర్పిలు కనకరాజు, వెంకటరత్నం, సునీత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టి ఆర్ ఎల్ శిక్షణా తరగతులు ఉపాధ్యాయులకు టి ఏ ఆర్ ఎల్ శిక్షణా తరగతులు.

చింతలపూడి ప్రభాతవార్త అక్టోబర్ 17: చింతలపూడి మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల లో 3నుండి 5 తరగతులకు భోధిస్తున్న ఉపాధ్యాయులకు 4 రోజుల పాటు శిక్షణా తరగతులు ఇస్తున్నామని మండల విద్యా శాఖాధికారి %+%. రామారావు గారు అన్నారు. ఈ శిక్షణ రెండు విడతలుగా ఈ నెల 17 నుండి 20 వరకు,రెండవ విడత 26 నుండి 29 వరకు తరగతులు నిర్వహిస్తున్నామని విద్యాశాఖాధికారి అన్నారు. టీచింగ్ యట్ రైట్ లెవల్ అనే అంశంపై శిక్షణ ఉంటుందని, కరోన కాలంలో ప్రాథమిక పాఠశాలలోవిద్యార్థులు వెనుకబడి ఉన్నారని, తెలుగు, గణితం సబ్జెక్టు ల పై శిక్షణ ఇస్తున్నామని మండలం రిసోర్స్ పర్సన్స్ గా




మిరియాల మోషే గారు, ఐ. జ్యోతి గారు, గోపాల కృష్ణ నాయక్ రవి కిషోర్ లు వ్యవహరిస్తారని విద్యాశాఖాధికారి అన్నారు.

# పశ్చిమగోదావరి,ఏలూరు వార్త



## ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ కింద ఎడాదికి రూ. 6 వేలు రైతుల ఖాతాలకు జమ..


**-16 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాలకు జమచేసిన కేంద్రం .. కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి**

ప్రభాతవార్త-ఏలూరు : దేశం అభివృద్ధి చెందాలంటే రైతు సంతోషంగా ఉండాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మరియు ఈశాన్యరాష్ట్రాల అభివృద్ధి శాఖా మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. పియం కిసాన్ 12వ విడత నిధులు విడుదల వర్చువల్ ప్రారంభోత్స,వం, ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి 600 కేంద్రాల ప్రారంభోత్సవం, వన్ నేషన్ వన్ ఫెర్టిలైజర్ ను ప్రధాన మంత్రి నరేంద్రమోడి వర్చువల్ గా ప్రారంభించే కార్యక్రమంలో ఏలూరు నుంచి కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి పాల్గొన్నారు. వీరితోపాటు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాజీ శాసన మండలి సభ్యులు, బిజేపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధనరెడ్డి, ఆర్డిఓ కె. పెంచల కిషోర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై. రామకృష్ణ, తహశీల్దారు సోమశేఖర్, కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కు చెందిన సుబ్బారెడ్డి, కె. సత్యనారాయణ, ఖాళిదాస్, ప్రమాణిక్, శ్రీ రామాంజనేయ మెన్యూర్స్ కంపెనీ



జయ ప్రకాష్, బిజేపి నాయకులు అంబికా కృష్ణ, పాకా సత్యనారాయణ, మాలతీరాణి, భూపతిరాజు శ్రీనివాసువర్మ, నిర్మల కిషోర్, లక్ష్మీపతిరాజ, దేవి తదితరులు వీక్షించారు. గతంలో ఎరువులకోసం క్యూలు, ఎన్నో కష్టాలను రైతులు ఎదుర్కొనేవారని నరేంద్రమోడి ప్రధాని అయ్యాక ఎల్లవేళలా ఎరువులను అందుబాటులో ఉంచుతున్నారన్నారు. ప్రధాని నరేంద్రమోడి పియం కిసాన్ ద్వారా ఏడాదికి రూ. 6 వేలు రైతుల బ్యాంకుల ఖాతాల్లో జమ చేస్తున్నారని చెప్పారు. రైతు సంక్షేమమ ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

# సిత్రాంగ్ ...ఏ చిత్రాలను మిగులుస్తుందో..



నరసాపురం - ప్రభాతవార్త : కోస్తా ప్రాంతానికి భారీ తుపాను హెచ్చరిక జారీఅయింది. దీనికి ఇప్పటికే నామకరణం చేసారు. సిత్రాంగ్ అని ఇండోనేషియా నుంచి పేరు కూడా పెట్టారు. రాబోయే రెండు రోజుల్లో తుపాను ఉంటుందని ఆంధ్రా తెలంగాణా ఒరిస్సా, ఉత్తర ప్రదేశ్‌లకు దీని ప్రభావం ఉంటుందని వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరించింది. దాదాపు అక్టోబర్ నెలంతా వర్షాలే వర్షాలు గత నాలుగు రోజులుగా నరసాపురంలో భారీ వర్షాలు పడుతూనేవున్నాయి. సోమవారం ఎండ కాసినట్లే కాసి వర్షం తన తడాఖా చూపించింది. మరోవైపు సిత్రాంగ్ హెచ్చరికతో వరి రైతులు దడదడలాడుతున్నారు. వాతావరణ శాఖ హెచ్చరించినట్లుగానే వర్షం పడితే ఉభయగోదావరిజిల్లాల్లో దాదాపు 5 లక్షల హెక్టార్లల్లో వరికి రెండు లక్షల హెక్టార్లల్లో ఆక్వాకు పెనుగండం తప్పదు. ఇప్పటికే ఈ రెండు వ్యవసాయ రంగాలు కూడా అత్యంత దారుణమైన నష్టాలను మూటకట్టుకుని చావలేక బ్రతకలేక అన్నట్లుగా రైతాంగ పరిస్థితివుంది. ఒకప్పుడు తెలంగాణాలో వర్షాభావ ప్రాంతాల్లో పత్తి రైతులు, వరిరైతులు ఆత్మహత్యలకు పాల్పడేవారు. రైతు ఆత్మహత్యలనేవి గోదావరి జిల్లాల్లో బహు తక్కువ. కానీ గడచిన నాలుగు సంవత్సరాల నుండి వ్యవసాయం అంటేనే నష్టం అనే నిర్వచనం రావడంతో చేసిన అప్పులు తీరక ఈ ప్రాంత రైతులు కూడా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అసలు తీరక అసలీఫాయిదాలు కొండలా పెరిగిపోవడంతో గుండెలవసి పేద రైతులు ఉరితాడునే ఎంచుకుంటున్నారు. సిత్రాంగ్ అన్నంతపని చేస్తే ఏ చిత్రాలను చూడవలసివస్తుందోనని అందరిలోనూ ఆందోళన నెలకొంది.

# నాడు నేడు పనులకు శంకుస్థాపన

పొడూరు, అక్టోబర్ -16, ప్రభాతవార్త: మండలంలోని గుమ్ములూరు పంచాయతీ రావిగొప్పు మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నాడు నేడు పథకంలో భాగంగా నూతల పాఠశాల భవన నిర్మాణానికి స్థానిక జడ్పిటిసి సభ్యులు గుంటూరు పెద్దిరాజు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గుంటూరు పెద్దిరాజు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మారిపోయాయని అన్నారు.ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ హంగులతో రూపుదిద్దుకుంటున్న అని అన్నారు ప్రజలందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోడూరు మండల ఎంపీపీ సుమంగళి , గుమ్మలూరు సర్పంచ్ గొట్టుముక్కల సోనియా రమేష్ , వైస్ సర్పంచ్ అల్లూరి గీతావాణి , గుమ్మలూరు అంబటి సుధాకర్ , గుమ్మలూరు 9వ వార్డు సభ్యులు జుత్తిగ వెంకట సత్యనారాయణ , గుమ్మలూరు 8వ వార్డు సభ్యులు శ్రీ కొండేటి వెంకటేశ్వరరావు , వైకాపా నాయకులు గొట్టుముక్కల సురేష్ ,



పిల్లి నాగన్న ,పైడి ఏసుబాబు , తిమ్మరాజు , పైడి ఈశ్వరరావు , కుక్కల నాగేశ్వరరావు , మాజీ గుమ్మలూరు సర్పంచ్ కుక్కల దుర్గారావు, పాఠశాల పిసి చైర్మన్ గుడాల మావుళ్ళు , మండల .ఏ.ఈ పడమట ఏడుకొండలు , గుమ్మలూరు సచివాలయం ఇంజనీర్ మరపట్ల వెంకటేశ్వరరావు , పాఠశాల ప్రదానోపాధ్యాయుడు మజ్జి శ్రీనివాసరావు, సహోపాధ్యాయులు ముదునూరి వెంకట సంజీవరాజు , గ్రామ సంఘాల పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# హత్య కేసు నమోదు

**జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త :** యువకునిపై కక్షతోఅతనిని మరో వ్యక్తి సహాయంతో హత్య చేసి పూడ్చిపెట్టిన సంఘటనపై లక్కవరం పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం ఎస్సై దుర్గామహేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం - ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్ పరిధి గొడుగుపేట గ్రామానికి చెందిన ఒక సామాజికవర్గానికి చెందిన యువతితోలక్కవరం పీఎస్ పరిధిలోని మరో సామాజికవర్గానికి చెందిన యువకుడు ప్రేమించుకున్నారు. వివాహం జరగదేమోనని భయంతో మూడు నెలల క్రితం యువతి ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. దీంతో ఆ యువకునిపై కక్ష పెంచుకున్న యువతి తండ్రి అదను చూసుకుని ఇటీవల మరో వ్యక్తి సహాయంతో హత్య చేసి, పూడ్చిపెట్టాడు. ఈ సమాచారం అందుకున్న లక్కవరం ఎస్సై దుర్గా మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు మద్దిలో అధికారులతో సమావేశం

**జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త :** కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామివారి ఆలయంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు వివిధ శాఖల అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు కీసరి సరితా విజయభాస్కర్‌రెడ్డి, ఆలయ ఈవో కొండలరావు తెలిపారు.

# విద్యార్థులలో సామర్థ్యాలను పెంపొందించాలి

## మండల విద్యాశాఖ అధికారి ప్రేమ జ్యోతి

పోడూరు,అక్టోబర్ -17, ప్రభాతవార్త: ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు తమ తరగతికి నిర్ణయించిన స్థాయి సామర్థ్యాలను సాధించేందుకు టరల్ శిక్షణను ఉపాధ్యాయులు వినియోగించుకోవాలని మండల విద్యాశాఖ అధికారి ఏ.యస్.కే.వి.ప్రేమ జ్యోతి అన్నారు. పోడూరు కల్నల్ డి ఎస్ రాజు ఉన్నత పాఠశాల నందు మండలంలోని ప్రాథమిక,ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు మొదటి విడత నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం యం.ఇ.ఓ ప్రేమ జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3,4,5 తరగతులలో సామర్థ్యాలపరంగా వెనుకబడిన విద్యార్థులను ప్రారంభ పరీక్ష ద్వారా గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఆయా తరగతులకు తగిన సామర్థ్యాల స్థాయికి తీసుకురావడానికి చేపట్టవలసిన చర్యలు, విద్యార్థులచే చేయించవలసిన కృత్యాలపై మండలంలోని ఉ



పాధ్యాయులకు రెండు విడతలుగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు జనార్ధన్ రాజు, ఏ.అన్నపూర్ణేశ్వరరావు, ఏ.కే.బసవలింగం, వై.వి.చల్లారావు కే.భారతిలు మండలం స్థాయి రిసోర్స్ పర్సన్ లుగా శిక్షణ ఇస్తున్నారు. ఈ .కార్యక్రమంలో ఉపాధ్యాయులు ,సి.ఆర్.పి.లు పాల్గొన్నారు.

# జనసేన నిరసన ర్యాలీ

భీమవరం అక్టోబర్ 17(ప్రభాతవార్త )జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గారు ఉత్తరాంధ్ర విశాఖపట్నం జనవాణి కార్యక్రమంనకు విచ్చేయగా ఈ కార్యక్రమం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా అనేక ఇబ్బందులు గురి చేస్తున్న కారణంగా మరియు జనసేన నాయకులను అక్రమంగా అరెస్టు చేసినందుకు గాను జిల్లా అధ్యక్షులు, భీమవరం నియోజకవర్గం ఇంఛార్జి కొటికలపూడి గోవిందరావు గారి అధ్వర్యంలో ఉదయం 10 గంటలకులి భీమవరం నియోజవర్గం జనసేన పార్టీ కార్యాలయం నుండి నిరసన తెలియజేస్తూ ప్రకాశం చౌక్ లో గల అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రంలి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమములో రాష్ట్ర పి ఏ %ఉ% సభ్యులు కనకరాజు సూరి గారు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉండి నాయకులు జుత్తిగా నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి గవర లక్ష్మి, ,భీమవరం పట్టణ అధ్యక్షులు చెనమల్ల చంద్ర శేఖర్ గారు, సెక్రటరీ సుంకర రవి, భీమవరం మండల అధ్యక్షులు వెూకా శ్రీనివాస్,సెక్రెటరీ కత్తుల నిలెంద్ర, వీరవాసరం మండలం అధ్యక్షులు గుండా రామకృష్ణ, కాళ్ల



మండల అధ్యక్షులు రాము,ఎం పి పి అడ్డాల రాము,ఎంపీటీసీ లు గుల్లిపల్లి విజయలక్ష్మీ, తాతపూడి రాంబాబు, అరేటి వాసు ,ఆకుల మౌనిక, మాజి కౌన్సిలర్ మగాపు ప్రసాద్, వానపల్లి నూరిబాబు, జిల్లా కార్యక్రమాల కమిటీ సభ్యులు కార్తిక్,నియోజకవర్గం జనసేన నాయకులు బండి రమేష్, ఉండవల్లి శ్రీను,ఏడుకొండలు, పంతం ప్రసాద్,త్రివిక్రమ్, లోవరాజు, భాస్కర్ రావు, పుప్పాల బాలాజీ,పుప్పాల సుబ్బారావు,భీమవరం , ఉండి నియోజకవర్గం నాయకులు జనసైనికులు, కార్యకర్తలు ,వీర మహిళలు పాల్గొన్నారు.

# డ్రైన్ సరిచేస్తానంటే, ఆర్థిక సహాయం అందిస్తా

## గ్రామస్థుడు అమాజురి స్పందన లో వినతి

తాళ్ళపూడి అక్టోబర్ 17 (ప్రభాతవార్త): మండల కేంద్ర మైన తాళ్ళపూడి లో మురుగు నీటి డ్రైన్ కొరకు ఆర్థిక సహాయం అందిస్తానని, అత్యవసర డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి అంటూ ఇదే గ్రామానికి చెందిన అమజురి సూర్య నారాయణ అనే ఒక వ్యక్తి అధికారులకు స్పందనలో విజ్ఞప్తి చేశారు. తాళ్లపూడి గ్రామానికి సంబంధించిన బిసి కాలనీ సమీపం లో ని సందులో వర్షం వచ్చినప్పుడల్లా వాడకపు నీరు, వర్షపు నీరు, డ్రైనేజీ లోకి వెళ్ళని పరిస్థితుల్లో సీసీ రోడ్డు మీదే ఉండిపోవటంతో ఆ ప్రాంత ప్రజలకు, అటుగా వెళ్లే విద్యార్థులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్పందనలో అందించిన దరఖాస్తులో సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆ సందులో నీరు బయటకు పోయేందుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజి ఉన్నప్పటికీ నీరు నిల్వ ఉండి పోతోందని, చర్యలు తీసుకోవాలని సదరు డ్రైన్ ఏర్పాటుకు అవసరమైన పైపులు కొరకు ఆర్థిక సహాయం అందిస్తానని పేర్కొన్నారు .ఇదే విషయాన్ని పంచాయతీ కార్యదర్శి కూడా తెలియపరిచామని, పదిమందికి ఉపయోగపడే ఈ



కార్యక్రమానికి తాను ముందు ఉంటానని ఆయన స్పందనలో ఇచ్చిన దరఖాస్తుల పేర్కొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ పి.జి.సెట్-2022 ఫలితాలలో "శ్రీఆదిత్య డిగ్రీ" కళాశాల హవా

భీమవరం అక్టోబర్(ప్రభాతవార్త )పి జి సెట్ ఫలితాలలో శ్రీ ఆదిత్య డిగ్రీ కాలేజ్ తనప్రతిభను చాటుకుంది.వందలోపు ఏడు, ఐదువందలలోపు పన్నెండు, వెయ్యిలోపు పద్నాలుగు ర్యాంకులు వచ్చాయని కళాశాల డైరెక్టర్ ఎం .శ్రీనివాస్ గారు తెలియజేసారు.ఫిజిక్స్ విభాగములో నగిడి.పూజిత కి 11వ ర్యాంక్,కంప్యూటర్ సైన్స్ విభాగములో జయమంగళ.లక్ష్మీనరసింహరెడ్డి కి 28వ ర్యాంకు,స్టాటిస్టిక్స్ విభాగములో ఉండవల్లి.ఉమామహేశ్వరి కి 85 ,బొమ్మిరెడ్డిపల్లి. శేషసాయిలలితశ్రీ కి 91 ,మిడతని హారిక కి 247 ,కొమండూరి. రాధా సుష్మిత కి 353 ,పుప్పాల. కత్యాయని కి 449 , గంటసాల. నవ్యశ్రీ కి 616 వ ర్యాంకులు,మాథెమటిక్స్ విభాగములో కొట్టె. సునీతరాణి కి 33 ,జడ.లావణ్య కి 46 ,జింక.రూపదేవి కి 58 ,ఆదాడ.తనూజ కి 130 ,విద్యసాయి మౌనిక కి 605 వ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ఏ. అనురాధ గారు తెలియజేసారు.ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆదిత్య విధ్యా సంస్థల చైర్మన్ డాక్టర్. నల్లమిల్లి శేషరెడ్డి గారు, సెక్రటరీ డాక్టర్. నల్లమిల్లి సుగుణరెడ్డి గారు, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు గారు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ బి.మావుళ్లు, ఏ.ఓ.బి.సురేష్ కుమార్ మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

# ఉద్యానవన పంటలపై గిరిజన రైతులకు అవగాహన కార్యక్రమం

జీలుగుమిల్లి, అక్టోబర్ -17, ప్రభాతవార్త: మండల కేంద్రం జీలుగుమిల్లి కేంద్ర పొగాకు పరిశోధన స్థానం లో వెంకట రామన్నగూడెం డాక్టర్ వైయస్సార్ ఉద్యానవన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జాతీయస్థాయి గిరిజన ఉద్యానవన కార్యక్రమం గిరిజన ఉప ప్రణాళిక లో భాగంగా సోమవారం జరిగింది. ఈ సందర్భంగా 70 మంది ఔత్సాహిక గిరిజన రైతులను వెంకట రామన్నగూడెం డాక్టర్ వైయస్సార్ ఉద్యానవన విశ్వవిద్యాలయానికి తీసుకెళ్లడం జరిగింది. అక్కడ ఏర్పాటు చేసిన కిసాన్ సమ్మన్ సమ్మేళన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యానవన పంటలు వాటి ఆవశ్యకత, .లాభసాటి ఉద్యానవన పంటల సాగుపై గిరిజన రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. గిరిజన రైతులకు ఇలాంటి అవగాహన కల్పించినటువంటి ఉద్యానవన విద్యాలయం శాస్త్రవేత్తలకు సిటిఆర్ఐ డైరెక్టర్ దామోదర్ రెడ్డి అభినందనలు తెలిపారు.గిరిజన



రైతులందరూ ఈ అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ దామోదర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో సిటిఆర్ఐ మేనేజర్ ఎంవి జయ కృష్ణారావు, సిబ్బంది టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ జోడో యాత్రకు నిడదవోలు నుండి తరలి వెళ్లిన కార్యకర్తలు



నిడదవోలు అక్టోబర్ 17 (ప్రభాతవార్త) : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ సమైక్యత కోసం భారత్ జోడోయాత్ర చేస్తున్న సందర్భంలో నిడదవోలు నియోజకవర్గం ఇంచార్జ్ పెద్దిరెడ్డి సుబ్బారావు ఆధ్వర్యంలో నిడదవోలు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కారింకి వెంకటేశ్వర రావు అధ్యక్షతన శ్రీ రాహుల్ గాంధీ చేస్తున్న జోడోయాత్రలో పాల్గొనేందుకు నిడదవోలు నుండి కార్యకర్తలు తరలి వెళ్లారు. నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఈ సందర్భంగా మాట్లాడుతూ విభజన రాజకీయాల విద్వేషాల నుండి విచ్ఛిన్నమవుతున్న భారతదేశాన్ని ఐక్యత చేయడం కోసం ఈ యాత్ర కొనసాగుతుందని అన్నారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు చిన్నం మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి హీరాలాల్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వర్ ఖాన్, భావన రమేష్, కాకి కిషోర్ తదితరులు యాత్రలో పాల్గొనేందుకు కర్నూలు వెళ్లారు

# అయ్యప్ప స్వాములకు కొవ్వూరి గాంధీరెడ్డి కుటుంబీకుల అన్నదానం

తాడేపల్లిగూడెం,అక్టోబర్17,ప్రభాతవార్త : స్వామి అయ్యప్ప మాల ధరించి దీక్ష చేపట్టిన స్వాములకు కొవ్వూరి గాంధీరెడ్డి కుటుంబీకులు అన్నదానం నిర్వహిస్తున్నారు. స్థానిక పడాల లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప సేవా సమితి ప్రతీ ఏటా దాతల సహకారంతో స్వాములకు మూడు నెలల పాలు (90 రోజులు) నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా గత కొన్నేళ్లుగా కొవ్వూరి గాంధీరెడ్డి కుటుంబీకులు 50 రోజులు పాటు వారి సొంత ఖర్చులతో స్వాములకు అన్నదానం నిర్వహిస్తున్నారు. కీర్తిశేషులు కొవ్వూరి గాంధీ రెడ్డి, ఆయన కుమారుడు కీర్తిశేషులు కొవ్వూరి హేమమిత్ర నరసారెడ్డి ల జ్ఞాపకార్థం గాంధీరెడ్డి సతీమణి కొవ్వూరి అమ్మాజీ, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కలిసి అయ్యప్ప దీక్షా ధారులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ నెల 16వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభమైన ఈ అన్న సమారాధన 90 రోజులు పాటు జనవరి 15వ తేదీ వరకు కొనసాగుతుంది. గాంధీరెడ్డి సతీమణి అమ్మాజీ, ఆమె కుమార్తెలు, అల్లుళ్లు, మనమలు, మనుమరాండ్రు స్వయంగా పాల్గని



స్వాములకు భోజన పదార్థాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి కార్యవర్గం, సభ్యులు, గాంధీరెడ్డి కుటుంబీకులు పాల్గన్నారు. అయ్యప్ప స్వాములకు 90 రోజులు పాటు అన్న సమారాధన కార్యక్రమం కొనసాగుతుందని ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమితి కోశాధికారి ద్వారంపూడి దేవరాజ్ రెడ్డి తెలియజేశారు.

# బకాయిల చెల్లింపు లు చేయలేదని ....,

## ఇసుక రాంప్ లు మూత

తాళ్ళపూడి అక్టోబర్ 17 (ప్రభాత వార్త): తాళ్లపూడి మండలం లోని ఇసుక రాంపులు అన్ని సోమవారం మూతపడ్డాయి. పడవ రాంపులన్నింటికి గోదావరి వరద నీటి శాపం ఒకటి కొనసాగుతుండగా, ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిలు రాక రాంప్ నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాంపులు మూసి వేశారు. ఇటీవల మారిన నిబంధనల ప్రకారం ఏ రోజుకు ఆ రోజు పడవ కార్మికులకు, తోడి తెచ్చిన ఇసుకకు డబ్బు చెల్లిస్తున్నారు. గతం లో ఆగస్ట్ నెలలో సరఫరా చేసిన ఇసుకకు చెల్లింపు లు జరగ లేదు. ఆ తరువాత కంపెనీ లు నిర్వహణ మారటం తో లక్ష లాది రూపాయల బకాయిల పద్ద మాట ఎవరు పట్టించుకోక పోవటం తో రాంపులన్ని ఒకే మాటగా సోమవారం మూసి వేశారు. పడవ కార్మికులు బకాయిల మాట తేల్చాల్సిందే అంటున్నారు. దూరప్రాంతం నుంచి వచ్చిన



లారీ ల వాళ్ళు ఇబ్బందులు పడ్డారు.

# నేడు ఎల్.అగ్రహారంలో జనసేన పల్లె పోరు

తాడేపల్లిగూడెం,అక్టోబర్17,ప్రభాతవార్త : జనసేన పార్టీ చేపట్టిన పల్లెపోరు కార్యక్రమం ఈ నెల 18వ తేదీ మంగళవారం తాడేపల్లిగూడెం రూరల్ మండలం ఎల్.అగ్రహారం గ్రామంలో జరుగుతుందని జనసేన పార్టీ తాడేపల్లిగూడెం మండల అధ్యక్షులు అడపా ప్రసాద్ సోమవారం ప్రకటించారు. జనసేన పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బలిశెట్టి శ్రీనివాస్ ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించి ఇంటింటికి వెళ్లి ప్రజలకు జనసేన పార్టీ సిద్ధాంతాలను, విధానాలను తెలియజేయడంతో పాటు వైకాపా ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, పవన్ అభిమానులు పాల్గనాలని విజ్ఞప్తి చేశారు.

# ఆత్మహత్యల వేదిక ... చించినాడ బ్రిడ్జి

నరసాపురం - ప్రభాతవార్త : బలవన్మరణానికి గోదావరి పరివాహక ప్రాంతంలో అటు తూర్పు ఇటు పశ్చిమలో పది మండలాలను కలిపే చించినాడ వంతెన ఓ వేదికగా మారింది. ఈ వంతెనపై రాత్రిపూట ఆత్మహత్యలేకాదు అత్యాచారాలకు ఎంతో నెలవు. రాత్రి 7 దాటితే వాహనాల వెలుగు తప్ప వెన్నెల రాత్రుల్లో చందమామ కాంతి తప్ప మిగతా రోజుల్లో ఎప్పుడూ అంధకారమే. ఆత్మహత్య చేసుకోవాలనుకొనేవారికి ఇదే పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. వంతెన పై నుండి నడి నదిలో ఉరికితే రెండు మూడు రోజులకు గానీ మృతదేహం సముద్ర తీర ప్రాంతాల్లో దొరకదు. కొన్ని దేహాలైతే జలాచరాలకు అంకితం. అంతు చిక్కని మరణాలెన్నో. ఇటీవల వీటి సంఖ్య పెరుగుతూవస్తోంది. కొత్తగా వచ్చిన సబ్‌కలెక్టర్ దీనిపై దృష్టిపెట్టారు. చించినాడ వంతెనను ఆయన పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు. రాత్రివేళ వెళ్లి వంతెనపై పరిశీలించారు. చిమ్మచీకటిలో వంతెనపై ఆత్మహత్యలకు అనువగావున్నదని గుర్తించి ఇందుకు తగిన ఆదేశాలు జారీచేసారు. చించినాడ బ్రిడ్జి కట్టి మూడు దశాబ్దాలు దాటింది. అయినా ప్రభుత్వం దిండి నుంచి చించినాడ వరకు వీధి దీపాలను పెట్టలేకపోవడం దురదృష్టం. నగరాల్లో వంతెన స్థంభాలను సైతం లతల్లా విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో కనీసం వీధి దీపాలకు కూడా దిక్కులేకపోవడం గ్రామ స్వరాజ్యాన్ని వెక్కిరిస్తోంది.

# జనసేన పార్టీనాయకులు నిరసన

. లింగపాలెం ప్రభాతవార్త 17......లింగపాలెం మండలం:విశాఖలో జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారిపై అరచితంగా వ్యవహరించిన వైసిపి ప్రభుత్వం విధానానికి నిరసనగా ఈరోజు లింగపాలెం మండలం జనసేన పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రం అందించడం జరిగింది.. ఈ సందర్భంగా లింగపాలెం మండల అధ్యక్షుడు పంది మహేష్ బాబు మాట్లాడుతూ జనసేన నాయకులపై అక్రమ కేసులు బనాయించడం, వారిపై దాడులు, అరెస్టులు చేయడం, పోలీసుల చేత పవన్ కళ్యాణ్ గారిని అణచివేయాలని చూస్తే రాష్ట్రంలోని కార్యకర్తలు తిరుగుబడతారని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మాదాసు కృష్ణ ఉపాధ్యక్షులు తాళం మల్లేశ్వర రావు , కార్యదర్శులు పంది సతీష్ కుమార్ పొదిల మహేష్ బంటు సామ్యూల్ పఠాన్ సుభాని మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# నరసాపురం అక్టోబరు 17 : ఫొటో నెం.3 : రైతు భరోసా అత్తిలిలో రైతు భరోసాకు రూ.190లక్షలు

అత్తిలి - ప్రభాతవార్త : అత్తిలి మండలంలో రైతు భరోసాకింద రూ.190 లక్షలు విడుదలైనట్లు మండల వ్యవసాయాధికారి టి.కె రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. 6106 మందికి రూ.2 వేలు చొప్పున రూ.122 లక్షలు, రూ.7500/-లు చొప్పున 153 మందికి రూ.1147 లక్షలు విడుదలైనట్లు తెలిపారు. రూ.11500/-లు చొప్పున 15500 మందికి రూ.57 లక్షలు మంజూరైందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ ఆదేశాలతో కె.వైసి వగైరాలను ఎప్పటికప్పుడు పూర్తిచేసుకోవాలని కోరారు.

# మొయ్యేరులో ఉచితంగా కంటి వైద్యం

అత్తిలి - ప్రభాతవార్త : అత్తిలి మండలం మొయ్యేరు గ్రామం ఉచితంగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి లయిన్స్ క్లబ్ విశేష సేవలందించింది. పాలకొల్లు లయిన్స్ క్లబ్ వారు గ్లోబల్ మెంబర్ షిప్ అప్రోచ్ కోఆర్డినేటర్ ఎన్.వి.ఎస్ పాపారావు శిబిరాన్ని ప్రారంభించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో పరీక్షలు జరిపి కళ్లజోళ్లు ఇచ్చారు. అవసరమైనవారికి ఆపరేషన్‌లు చేస్తామన్నారు. క్లబ్ అధ్యక్షులు పట్నాల వెంకటేశ్వరరావు, కార్యదర్శి బిటికె ప్రసాద్, ఉలుసు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్‌ని అరెస్టు చేస్తే విశాఖపట్నం ముట్టడికి మేము వెనకాడము

## బత్తుల బలరామకృష్ణ



కోరుకొండ అక్టోబర్ 17 (ప్రభాతవార్త)జనసేన పార్టీ వ్యవస్థాపకులు పవన్ కళ్యాణ్ నిఅరెస్టు చేస్తే విశాఖపట్నం ముట్టడికి వెనకాడమని రాజానగరం నియోజకవర్గ జనసేన నాయకులు బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. కోరుకొండ మండల ప్రధాన కేంద్రంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం నుండి కోరుకొండ బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, రోడ్డుపై బైఠాయించి కొంతసేపు వాహనాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శనివారంవిశాఖపట్నంలోజరిగినటువంటి పవన్ కళ్యాణ్ పర్యటన నిమిత్తం విశాఖపట్నం ఎయిర్పోర్ట్ కి చేరుకోవడంజరిగిందని, అదే సమయంలో విశాఖ గర్జనలో భాగంగా వైసిపి నాయకురాలు రోజా విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ న్ని దుర్భాషలాడుతూ దూషించారని అయినప్పటికీ పవన్ కళ్యాణ్ అభిమానులు జనసైనికులు సమన్వయం పాటించి విశాఖలో జరగబోయే ర్యాలీని దృష్టిలో పెట్టుకుని సహనంగా ఉన్నారన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఎటువంటి గొడవలు జరగకుండా జనసైనికులు, జనసేన నాయకులు ఎంతో వైభవంగా పవన్ కళ్యాణ్ కి ఘన స్వాగతం పలకడం జరిగిందన్నారు.ఆ జనసంద్రోహాన్ని చూసి ఈర్ష్యతో వైసీపీ శ్రేణులు పథకం ప్రకారం ఎయిర్పోర్ట్ దగ్గర ఉన్న జన సైనికులలో కలిసిపోయి కావాలని వైసీపీ శ్రేణులు మీద దాడి చేయించుకుని సానుభూతి పొందే ప్రయత్నం చేశారని అన్నారు. రోజా ఆమె మీద వైసీపీ శ్రేణులతో, అనుచరులతో దాడి చేయించుకుని ముఖంలో ఎటువంటి కోపముగాని బాధ గాని లేకుండా నవ్వుతూ లోపలికి వెళ్ళిపోయారని, అంతా జరిగిపోయాక వారికి కావాల్సిన ఆధారాలు సేకరించుకుని వారి కుట్రలో భాగంగా మీడియా ముఖంగా కొత్త హైడ్రామాకు తెర లేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజా నటనాప్రావీణ్యం మనందరికీ తెలిసిందేనని, కాబట్టి ఆమె మీడియా ముందు బాగా నటించారన్నారు. కానీ ధర్మం, మంచితనం, ఓర్పు అనేది మా నాయకుడి ద్వారా మేము అలవర్చుకున్న నడవడిక అని ర్యాలీని మార్గ మధ్యలో కావాలని విద్యుత్ సరఫరా ఆపేసి ఈ ప్రభుత్వం తన ఈర్ష్యనుచూపించుకుందని ఎద్దేవా చేశారు. వైసీపీ నాయకులు ఎన్ని ప్రయత్నాలు చేసినా జన సైనికులు ఉన్నంతవరకు మా అధినాయకుడుపవన్ కళ్యాణ్ ని ముట్టుకోలేరని అన్నారు. పక్కా ప్లానింగ్ తో పోలీసు బలగాలను ఉపయోగించి జనసేన మీద దాడి చేసి అనంతరం నోవాటెల్ హోటల్ లో ఉన్న జనసేన నాయకులను విచక్షణ రహితంగా ఎటువంటి తప్పు లేనప్పటికీ అరెస్టులు చేయడం పవన్ కళ్యాణ్ గదిని పదేపదే చెక్ చేయడం పవన్ కళ్యాణ్ వాహనం తాళాలను అడగడం ఇలాంటి చర్యలు చేసి వైసిపి తన చేష్టలను బయట పెట్టుకున్నారని అన్నారు. ఆఫ్ఘనిస్తాన్ ని తలపించే విధంగాఈ ప్రభుత్వ పద్ధతిని వ్యతిరేకిస్తూ రాజానగరం నియోజకవర్గంనుంచి అరెస్టయినా మా జనసేన నాయకులకు మద్దతుగా భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పోలీసులు, అధికారులు వారి పరిధి వరకు పనిచేయాలని ప్రజాక్షేమమే వారిలక్ష్యంగాపనిచేయాలని, ఏ పార్టీ విధానాలకు వత్తాసు పలకకూడదని బత్తుల ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మేడిశెట్టి శివరాం, కిమిడీ శ్రీరామ్, బదిరెడ్డి దొర, సూరపురెడ్డి రాజారావు, మద్దిరెడ్డి బాబులు,మాధవరపు శ్రీనివాస్ (ఆలీ), బోయిడి వెంకట్, గల్లా రంగ, నాతిపాము దొర, అడ్డాల శ్రీను, అడ్డాల దొర, వేగిశెట్టి రాజు, గంగిశెట్టి రాజేంద్ర, కవల శ్రీరాం, దుర్గాప్రసాద్ (డి.డి) తెలగంశెట్టి మధు, కొత్తపల్లి బుజ్జి, బుద్దాల అర్జున్, డి ఎం ఎస్, సూరంపూడి సురేష్, గుర్రాల వెంకటేష్, సుంకర మణి కుమార్, నక్కా చైతన్య లతో పాటు రాజానగరం నియోజకవర్గ జనసేన నాయకులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## రాజవొమ్మంగిలో అల్లూరిజిల్లా డ్రగ్ ఇన్ స్పెక్టర్ తనిఖీ



రాజవొమ్మంగి, అక్టోబరు 17, ప్రభాతవార్త: రాజవొమ్మంగి మండల కేంద్రంలో ఉన్న ఆరు జనరల్ మందుల షాపులను అల్లూరి జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ ఎన్.కల్యాణి, నర్సీపట్నం డ్రగ్ ఇన్ స్పెక్టర్ ఎన్.యుగంధర్ సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం కళ్యాణి పాత్రికేయులతో మాట్లాడుతూ అల్లూరి జిల్లా 141షాపుల్లో 132 మాత్రమే పరిగణనలోకి తీసుకొని వాటిలో 60 మందుల షాపులను తనిఖీ చేశానన్నారు. వాటిలో 15 షాపుల్లో పార్మాసిస్టులు లేరని గుర్తించామన్నారు. 61 షాపుల్లో 30 షాపులపై కేసులు నమోదు చేశామన్నారు. 160 రకాల మందులు ధరలు తగ్గాయని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కాలం చెల్లిన మందులు అమ్మినా,,అధిక ధరలకు విక్రయించినా, బిల్లులు ఇవ్వక పోయినా నేరుగా 7382934336కు ఫోన్ చేసి తెలుపవచ్చునని అన్నారు. పాడేరు, చింతూరు ల్లో హోల్ సెల్ జనరల్.మందులు షాపులు ఉన్నాయని తెలిపారు.

## గిరిజన విద్యారంగం సమస్యలపై కమిషనరేట్ ముట్టడి... ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు



రాజవొమ్మంగి,అక్టోబర్ 17, ప్రభాతవార్త.: గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలల్లో మూడున్నర యేళ్ళుగా విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోక పోవడంపై ఈ నెల 30న కమిషనరేట్ ను ముట్టడి చేయడం జరుగుతుందని ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ పి.డి.ఎఫ్ ఎం.ఎల్.సి ఐ. వెంకటేశ్వరరావు వెల్లడించారు. సోమవారం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల్లో విద్యారంగం సమస్యలపై చేపట్టిన జీప్ జాత రాజవొమ్మంగి మండలంలో కొనసాగింది. ఈసందర్భంగా ఎమ్మెల్సీ రాజవొమ్మంగి ఆశ్రమ పాఠశాలలో పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆశ్రమస్కూల్స్ లో సబ్జెక్టు టీచర్లు లేరన్నారు. సి.ఆర్.పి లు చాలా కాలంగా పనిచేస్తున్నా , వారిని రెగ్యులర్ చేయడం లేదన్నారు. గిరిజన మాతృభాషా వాలంటీర్ల రెగ్యులర్ బడ్జెట్ కేటాయించి, ప్రతీ ఆశ్రమ హైస్కూల్ లో హెచ్.డబ్ల్యు లను ప్రత్యేకంగా నియమించాలని, 20 డిమాండ్లతో జీపు జాత సాగింది. రాజవొమ్మంగి, సింగంపల్లి, జడ్డంగి, అమినాబాద్, బోర్నగూడెం ఆశ్రమ స్కూల్స్ లో సమస్యలను ఆయన తెలుసుకున్నారు. రంగంపేట మండలంలో సచివాలయ ఉద్యోగి ఆత్మహత్యకు కారకులపై చర్యలను తీసుకొని అన్ని రాయితీలు వచ్చేలా చూడాలని సచివాలయ ఉద్యోగులు ఎమ్మెల్సీ కి అర్జీని ఇచ్చారు. సి.ఆర్.టి , సి.ఆర్.పి లు రెగ్యులర్ చేయాలని, అన్ని ఆశ్రమస్కూల్స్ లో నోట్ బుక్స్, బెంచ్ లు, త్రాగునీటి సమస్య, ఇన్వర్టర్లులేవని, ఆర్.ఓ ప్లాంట్లు పనిచేయడం లేదని ఎం.ఎల్.సి దృష్టికి తెచ్చారు. ఆశ్రమస్కూల్స్ లో త్రాగునీటి సమస్య ఏర్పడితే చేతి పంపులు లేవని, ఎ.ఎన్.ఎం లను నియమించాలని ఎం.ఎల్.సి కు వివరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎఫ్ ఎం.ఎల్.సి ఐ.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరవర్మ, జిల్లా అధ్యక్షులు విల్సన్ బాబు, సబ్ కమిటీ కన్వీనర్ ఆదిరెడ్డి,జిల్లా కార్యదర్శులు రాజబాబు, మఠం ఉదయ్, మండల అధ్యక్షులు డి. పైడిమల్లి, సి.ఐ.టి.యు నాయకులు పుట్టా.రామరాజు, డి.వై.ఎఫ్.ఐ నాయకులు టి.శ్రీను, యుటిఎఫ్ లీడర్లు ఎం.సత్యవతి, బి.వెంకటలక్ష్మి, ప్రసన్న, రాజబాబు, జ్యోతి పాల్గొన్నారు.

## కోట్ల రాముడు కుటుంభాన్ని ప్రభుత్వం ఆదుకుంటుంది - సర్పంచ్ పిట్టా రామారావు



వి. ఆర్. పురం, అక్టోబర్ 17, ప్రభాతవార్త : అనారోగ్యంతో చికిత్స పొందుతు మృతి చెందిన చినమ్మటపల్లి గ్రామ పంచాయతీ, చింతరేగుపల్లి గ్రామానికి చెందిన కోట్ల రాముడు (30) కుటుంభాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, స్దానిక సర్పంచ్, వైపి సీనియర్ నాయకులు పిట్టా రామారావు స్పష్టం చేశారు. సోమవారం చింతరేవుపల్లి గ్రామం లోని మృతుని స్వగృహాన్ని సర్పంచ్ రామారవు, తహసీల్దార్ ఎన్ శ్రీధర్ సందర్శించి, కుటుంభ సభ్యులను పరామర్శించారు. మృతుని భార్య యశోద, చిన్నారులు రజిని, గౌతం ల ను వారు ఓదార్చారు. ఈ సంధర్భంగా తహసీల్దార్ శ్రీధర్ మాట్లాడారు. కుటుంభ పరిస్తితిని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ దృష్టికి తీసుకోని వెళ్లి, ప్రభుత్వం ద్వారా ఆర్ధిక సహాయం అందించెందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వి. ఆర్. ఒ జోగారావు, వైసిపి నాయకులు కోటం జయరాజు, ముత్యాల మురళి,గూటాల ముత్యాలరావు, కోట్ల సత్యనారాయణ, గూటాల వెంకటేశ్వర్లు, గూటాల నవీన్ తదితరులు పాల్గోన్నారు.

## మేకల కృష్ణను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే వరుపుల




శంఖవరం అక్టోబర్ 17 ప్రభాతవార్త : మండల కేంద్రం శంఖవరం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు తన పూర్వపు అనుచరుడు మేకల కృష్ణను సోమవారం పరామర్శించారు. ఇటీవల కాలంలో కృష్ణ తీవ్రంగా అనారోగ్యానికి గురైన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే వరుపుల పరామర్శించి, సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలని ఆకాంక్షించారు. ఈ సంధర్భంగా మాజీ ఎమ్మెల్యే వరుపుల మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో తన హయాంలో 49 రోడ్లు వేయించానని, కష్టపడిన కార్యకర్తలకు తాను ఎప్పుడూ వెన్నంటి ఉన్నానని, ఎన్నడూ వీడలేదని, దానివల్లే వారంతా పూర్తి సంతృప్తితో ఉండేవారన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో కొందరు కార్యకర్తలు స్తబ్ధులుగా ఉన్నారని, దీని నేపథ్యంలో రాజకీయ వలసలకు అవకాశముండడంతో తనకు తెలిసిన వెంటనే మనకు వైసిపి పార్టీ, పార్టీ అధినేత జగనన్న ముఖ్యమని తెలుపుతూ శాంతింపజేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు వెల్లడించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఈగల రాజబాబు, ఉరదాల సూర్యనారాయణ, ఆచంట వెంకటేశ్వరరావు, పిల్లా సూరిబాబు, దేవారపు బుజ్జి తదితరులు పాల్గోన్నారు.

## ఉపాధ్యాయులు శిక్షణా తరగతులు సద్వినియోగ పరుచుకోవాలి





రౌతులపూడి, అక్టోబర్ 17( ప్రభాతవార్త ): ఉపాధ్యాయులు శిక్షణా తరగతులు సద్వినియోగపరుచుకుని విద్యార్థులకు మరింత మెలకువతో విద్యనందించాలని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, జడ్పిటిసి గొల్లు చిన దివాణం అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ప్రాథమిక ఉపాధ్యాయులకు టి ఏ ఆర్ ఎల్ పై మొదటి విడత శిక్షణ తరగతులను వారు ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూ రెడ్డి సాయి, గ్రామ ఉపసర్పంచ్ వాసిరెడ్డి భాస్కర్ బాబు, పార్టీ కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, ఎంఈఓ ఎస్వీ నాయుడు, హెచ్ఎం గాడి కొండబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొత్తపేట ఆర్డీఓ స్పందనలో 10 ఫిర్యాదులు



కొత్తపేట : అక్టోబర్ 17 (ప్రభాత వార్త) ఆర్డీఓ కార్యాలయం లో జరిగిన స్పందన కార్యక్రమంలో 10 మంది తమ సమస్యలు పరిష్కరించాలని ఆర్డీఓ ఎం. ముక్కంటి కి వినతి పత్రాలు అందజేశారు. ప్రధానంగా ఆలమూరు మండలం బడుగువానిలంక ప్రజలు తమ గ్రామం నదీ కోతకు గురవకుండా అరికట్టాలని వినతిపత్రం అందజేశారు. నాలుగువేల జనాభా ఉన్న తమ గ్రామానికి మూడు వైపులా గోదావరి ప్రవహిస్తూ ఉందన్నారు. దీంతో తమకు సంబంధించిన లంక భూములు వరద వచ్చినప్పుడల్లా గోదావరిలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లంక భూములు కోతకు గురవకుండా తీరం వెంబడి అవసరమైన చోట టన్నెల్స్ వేయించి కోతను నివారించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.అలాగే వెదిరేశ్వరం గ్రామానికి చెందిన యల్లా ఆదిలక్షి తన కుమారులకు శెట్టిబలిజ కుల ధ్రువీకరణ పత్రం ఇప్పించాలని కోరింది. పలు మార్లు దరఖాస్తు చేసినా అధికారులు తనకు కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది.అలాగే వలు సమస్యలను పరిష్కరించాలంటూ మరో 8 మంది వినతులు ఇచ్చారు.

## జ్యోతుల.నెహ్రూ..పుట్టినరోజు. సందర్భంగా.గోకవరంలో..ఉచితమెగా మెడికల్ క్యాంపు




గోకవరం.. అక్టోబర్ 17 ప్రభాత.వార్త : గోకవరం మండలం గోకవరం గ్రామంలో.తమ అభిమాన నేత రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జగ్గంపేట మాజీ శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ పుట్టినరోజు పురస్కరించుకుని మాజీ జడ్పిటిసి సభ్యులు కాకినాడ జిల్లా టి.డి.పి.డాక్టర్స్ విభాగం అధ్యక్షులు డాక్టర్ పాలూరి బోసు బాబు ఆధ్వర్యంలో గోకవరం మెయిన్ రోడ్ లో గల ఆయన హాస్పటల్ నందు ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించడం జరుగుతుంది అని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ మంగళవారం నాడు మా అభిమాన నేత ఈ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ప్రజా నేత జ్యోతుల నెహ్రూ పుట్టినరోజు పురస్కరించుకుని తోలాత్( ప్రియదర్శిని) మెమోరియల్ మల్టీస్పెషల్టి హాస్పిటల్ రాజమండ్రి వారిచే మా హాస్పటల్ నందు ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఉచిత మెగా మెడికల్ నిర్వహించడం జరుగుతుందని ఉచితంగా మందులు పంపిణీ కూడా చేయడం జరుగుతుందని కావున గోకవరం చుట్టుపక్క ప్రాంతాల ప్రజలందరూ ఈ సదా అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఈ మెడికల్ క్యాంప్ లో పాల్గొనవలసిందిగా కోరుతున్నామని ఆయన తెలియజేశారు.

## మైనర్ బాలికను మోసగించిన వ్యక్తికి 11 ఏళ్ళ జైలు శిక్ష - రూ. 6 వేల జరిమానా - పోక్సో స్పెషల్ కోర్టు తీర్పు

రావులపాలెం, అక్టోబరు 17 (ప్రభాత వార్త) : పెళ్ళి చేసుకుంటానని నమ్మించి మైనర్ బాలికను మోసం చేసిన వ్యక్తికి కోర్టు 11 ఏళ్ళ జైలు శిక్ష, రూ.6 వేలు జరిమానా విధించినట్లు సిఐ ఎన్.రజినీ కుమార్ తెలిపారు. రావులపాలెం మండలం ఊబలంకకు చెందిన కరాడి దుర్గాప్రసాదు (దుర్గారావు) అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను పెళ్ళి చేసుకుంటానని నమ్మించి శారీరకముగా అనుభవించాడు. మూడేళ్ల పాటు ఈ వ్యవహారం నడిపి పెళ్ళిచేసుకోవడానికి నిరాకరించి మోసం చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో 2017 మే 1వ తేదీన పోక్సో చట్టం కింద రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేసారు. అప్పటి అమలాపురం డీఎస్పీ ఎల్. అంకయ్య కేసు దర్యాప్తు చేసారు. విచారణ పూర్తి కావడంతో కాకినాడ పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి ఎల్. వెంకటేశ్వరరావు సోమవారం నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, ఒక సంవత్సరం సాధారణ కారాగార శిక్ష వెరసి మొత్తం 11 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 6,000 జరిమానా విధించినట్లు సిఐ తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు అక్బర్, పి. శ్రీనివాస్ కేసు వాదించారని తెలిపారు.

## ముక్తేశ్వరంలో జనసైనికులు ర్యాలీ

అయినవిల్లి, అక్టోబర్ 17 ( ప్రభాత వార్త ) : విశాఖపట్నంలో జనసైనికులను అక్రమ అరెస్టు చేసినందుకు గాను మండలం కేంద్రమైన ముక్తేశ్వరం సెంటర్ లో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు గుర్రాల రాంబాబు , కరి లక్ష్మణ్ , వీరభద్రం , కోరపు ఈశ్వరరావు , పెంట చిన్ని , పెంట నాని , కోలా నాగు , మహేష్ అయినవిల్లి మండలం జనసేన పార్టీ మహిళా అధ్యక్షురాలు ఉషా , జిల్లా వీర మహిళ గిడ్డి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96,
Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps